**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :20 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 14 జూన్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## భారత్ నిర్ణయంతో పాక్ అల్లకల్లోలం!



- సుక్కూర్ బ్యారేజ్‌లో పడిపోయిన నీటిమట్టం
- బలూచ్, సింధ్ ప్రావిన్స్‌ల్లో ప్రమాదకర పరిస్థితులు!
- సింధూ జలాల ఒప్పందం నిలిపివేత ప్రభావం పాక్‌పై తీవ్రం
- సుక్కూర్ బ్యారేజ్ పరిధిలో కాలువలు ఎండిపోవడంతో రైతుల ఆందోళన
- సింధ్‌కు నీరు అందకపోతే పాక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావమని నిపుణుల హెచ్చరిక

## అందరికీ నీతులు చెప్పే ప్రకాశ్ రాజ్ ఇలాంటి చర్యలకు పాల్పడడం విడ్డూరంగా ఉంది



- నటుడు ప్రకాశ్ రాజ్‌పై ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు
- ధర్మస్థలం పవిత్రతను దెబ్బతీసేందుకు కుట్ర పన్నారని విమర్శ
- కేరళ నుంచి రూ. 200 కోట్లతో దుష్ప్రచారం చేశారని ఆరోపణ
- నిజాలు తేలాలని, దోషిగా తేలితే చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్



## పంజాబ్‌లో ఒంటరిగానే బీజేపీ పోరు

- 117 స్థానాల్లో పోటీకి సిద్ధం!
- 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు ఉండవని స్పష్టం చేసిన బీజేపీ
- అన్ని 117 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించిన పంజాబ్ బీజేపీ నేతలు

## రెండేళ్లలో మారిన పోలవరం

# రూపురేఖలు



- పరుగులు పెడుతున్న పనులు
- కూటమి సర్కార్ రాకతో ప్రాజెక్టుకు సరికొత్త వెలుగులు
- డి-వాల్‌ను 14 పూర్తి చేసి రికార్డు సృష్టించిన ప్రభుత్వం
- గోదావరి పుష్కరాల లోపే ప్రాజెక్టు పూర్తి చేసే దిశగా అడుగులు

**అమరావతి**

తుగ్లక్ మార్క్ నిర్ణయాలు, ఘోర తప్పిదాలు, అడ్డగోలుగా రివర్స్ టెండర్లు, కొట్టుకుపోయిన కోట్ల రూపాయలు. డ్యామేజీలు, సీపేజీలు. గతంలో చేసిన పనులన్నీ గోదావరి పాలు. ఇదీ పోలవరానికి వైఎస్సార్సీపీ చేసిన నష్టాలు. కూటమి సర్కార్ రాకతో కథ మొత్తం మారిపోయింది. ఐదేళ్లు అంధకారంలో ఉన్న ప్రాజెక్టుకు ఇప్పుడు సరికొత్త వెలుగులొచ్చాయ్. సీఎం వ్యూహాలు ఫలించాయ్. నిపుణుల సలహాలు తోడయ్యాయ్. పనులు పరుగులు పెడుతున్నాయ్. మొత్తంగా రెండేళ్లలో వివరాలు 2లో..



## ఐక్యంగా ఉండి ప్రజలను సంఘటితం చేస్తాం

- 2029 లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండి' కూటమి ఆల్రెడీ గెలిచేసింది
- 2029 ఎన్నికలపై రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- ఇండి కూటమిలో లోక్‌సభ ప్రతిపక్షనేత స్పీచ్
- పోటీలో గెలవడానికి నిష్పక్షపాతమైన ఎన్నికలే లేవని వ్యాఖ్యలు!
- అలాగే బీజేపీని, అది భారతదేశ వ్యవస్థలను తన గుప్పిట్లోకి తీసుకోవడంపై మేం ప్రతిఘటిస్తాం"

## తుని బాలిక అదృశ్యం ఘటనపై

# పవన్ కల్యాణ్ ఆరా



- ఆధారం అనుకున్న పెంపుడు కుక్క మృతి
- వారం రోజులు గడిచినా ఆచూకీ లభించకపోవడంతో తీవ్రత పెంచాలని ఆదేశం
- గాలింపు చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు వినియోగించుకోవాలని సూచన
- ఇప్పటికే 400 మంది సిబ్బందితో గాలిస్తున్నట్టు పవన్‌కు వివరించిన ఎస్పీ
- అటవీ నిపుణుల సాయంతో పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా జల్లెడ పట్టాలని సలహా

**అమరావతి**

కాకినాడ జిల్లా, తుని మండలం సీహెచ్ అగ్రహారంలో వారం రోజుల క్రితం అదృశ్యమైన బాలిక జ్ఞానేశ్వరి ఆచూకీని వీలైనంత వేగంగా కనుగొనాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై ఆయన శనివారం కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి, గాలింపు చర్యల పురోగతిని సమీక్షించారు. వారం రోజులు గడుస్తున్నా బాలిక ఆచూకీ లభించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, దర్యాప్తును మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై ఆయన పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రస్తుతం పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిర్వహిస్తున్న గాలింపు చర్యలకు అదనంగా మరిన్ని వివరాలు 2లో..



## ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల బలోపేతమే లక్ష్యం

- ఫ్రాన్స్, స్లోవేకియా పర్యటనకు ప్రధాని మోదీ
- ఫ్రాన్స్, స్లోవేకియా దేశాలకు అధికారిక పర్యటనకు బయలుదేరిన ప్రధాని మోదీ
- ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక సహకారాల విస్తరణపై ప్రధాన దృష్టి
- భారత్, ఫ్రాన్స్ స్పెషల్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ సమీక్ష

## రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం




- నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్న బొత్స
- రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని విమర్శ
- సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని నిలదీత

**అమరావతి**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తికాకముందే అన్ని రంగాల్లో విఫలమైందని వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఈరోజు విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొత్స పేర్కొన్నారు. రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, జొన్న, మామిడి పంటలకు కూడా వివరాలు 2లో..

# భారత్ నిర్ణయంతో పాక్ అల్లకల్లోలం!

పహల్గాం ఉగ్రదాడి తర్వాత సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు పాకిస్థాన్‌ను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పించే దేశంతో సాధారణ సంబంధాలు కొనసాగబోవని స్పష్టం చేసిన భారత్, సింధూ జలాల విషయంలోనూ కఠిన వైఖరినే కొనసాగిస్తోంది. దీంతో పాకిస్థాన్‌లో ఇప్పటికే కనిపిస్తున్న నీటి సంక్షోభం మరింత తీవ్రమవుతోందని అక్కడి మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రధానంగా సింధ్, బలూచిస్థాన్ ప్రావిన్స్‌లలో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే సుక్కూర్ బ్యారేజ్ పరిధిలో నీటి మట్టాలు ప్రమాదకరంగా పడిపోయినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌లోనే అతిపెద్ద నీటిపారుదల వ్యవస్థల్లో ఒకటైన ఈ బ్యారేజ్‌పై కోట్లాది మంది జీవనాధారం ఆధారపడి ఉంది. అయితే ప్రస్తుతం కాలువల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**రైతుల ఆవేదన**

సుక్కూర్ బ్యారేజ్1 పరిధిలోని ప్రధాన కాలువల్లో భారీగా నీటి కొరత నమోదైంది. దాదూ కెనాల్‌లో 82 శాతం, నార్త్ వెస్టర్న్ కెనాల్‌లో 64.1 శాతం, రైస్ కెనాల్‌లో 38 శాతం మేర నీటి లోటు ఏర్పడినట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. దాదూ కెనాల్‌కు కేటాయించిన నీటిలో స్వల్ప భాగమే చేరుతుండగా, నార్త్ వెస్టర్న్, రైస్ కాలువల్లోనూ పరిస్థితి ఇదే విధంగా ఉంది. దీంతో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించలేక రైతులు చేతులెత్తేస్తున్నారు. వరి నర్సరీలు సిద్ధం చేయడానికే నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక నీటి కొరతకు తోడు పాకిస్థాన్‌లోని ప్రావిన్స్‌ల మధ్య వివాదాలు మరింత ముదురుతున్నాయి. తమకు రావాల్సిన నీటిని పంజాబ్ ప్రావిన్స్ అక్రమంగా వినియోగిస్తోందని సింధ్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. పంజాబ్‌కు కేటాయించిన 44 వేల క్యూసెక్కుల నీటికి బదులుగా 53 వేల 394 క్యూసెక్కుల నీటిని వాడుకుంటోందని, అంటే 21 శాతం అదనంగా తీసుకుంటోందని విమర్శిస్తోంది. అదే విధంగా తౌన్సా బ్యారేజ్ వద్ద కూడా కేటాయింపుల కంటే 9.3 శాతం అధికంగా నీటిని మళ్లిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు చష్మా బ్యారేజ్ వద్ద నీటి మట్టాలు పెరుగుతున్నప్పటికీ దిగువ ప్రాంతమైన సింధ్‌కు మాత్రం తగినంత నీటిని విడుదల చేయడం లేదని అక్కడి నేతలు మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే సింధ్‌పై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాలు పాకిస్థాన్‌లో రాజకీయ దుమారానికీ కారణమయ్యాయి. కరాచీలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న నీటి సమస్యను పరిష్కరించడంలో పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ నేతృత్వంలోని సింధ్ ప్రభుత్వం విఫలమైందని జమాత్-ఎ-ఇస్లామీ పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. అధికారంలో ఉండి ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించింది. అయితే ఈ విమర్శలను పీపీపీ తిప్పికొడుతోంది. ఫెడరల్ వాటర్ మేనేజర్ల అసమర్థత, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల వల్లే సింధ్ ఈ పరిస్థితిని ఎదుర్కొంటోందని పీపీపీ సింధ్ అధ్యక్షుడు నిసార్ అహ్మద్ ఖుహ్రో ఎదురుదాడికి దిగారు. దేశ వ్యవసాయోత్పత్తిలో అత్యధిక వాటా అందించే సింధ్‌కు తగిన నీటి వాటా ఇవ్వకపోవడం ఆర్థిక మారణహోమమేనని ఆయన వ్యాఖ్యానించారు.

సింధ్ ప్రావిన్స్ పాకిస్థాన్ వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలుస్తోంది. ప్రతి ఏటా సుమారు 55 లక్షల టన్నుల వరి ధాన్యం అక్కడ పండుతుంది. బియ్యం ఎగుమతుల ద్వారా దాదాపు 1.4 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని సమకూరుస్తోంది. దేశ వ్యవసాయోత్పత్తిలో దాదాపు 67 శాతం వాటా ఈ ప్రాంతానిదేనని పాకిస్థాన్ నేతలే చెబుతున్నారు. అలాంటి కీలక ప్రాంతంలో సాగునీటి కొరత కొనసాగితే రైతులు తీవ్ర నష్టాలు చవిచూడటమే కాకుండా పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపైనా భారీ ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యవసాయ దిగుబడులు తగ్గిపోతే ఆహార భద్రత, ఉపాధి, ఎగుమతులు అన్నీ దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ అవలంబించిన కఠిన వైఖరి, ఇప్పుడు పాకిస్థాన్‌లోని జలవనరుల నిర్వహణ లోపాలు, అంతర్గత విభేదాలను మరింత బహిర్గతం చేస్తోంది. ఒకవైపు భారత్ తన నిర్ణయంపై వెనక్కి తగ్గే సూచనలు కనిపించకపోగా, మరోవైపు పాక్‌లో నీటి పంపిణీ వివాదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సింధూ జలాల సంక్షోభం పాకిస్థాన్‌కు రానున్న రోజుల్లో మరింత పెద్ద సవాల్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పంజాబ్‌లో ఒంటరిగానే బీజేపీ పోరు

పంజాబ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలకు ముందు ఎలాంటి పొత్తులు ఉండవని స్పష్టం చేసిన బీజేపీ, రాష్ట్రంలోని మొత్తం 117 అసెంబ్లీ స్థానాల్లో సొంతంగా పోటీ చేస్తామని ప్రకటించింది. ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారంలో ఉన్న పంజాబ్‌లో ఈసారి అధికారాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ వ్యూహాలు రచిస్తోంది. శనివారం దిల్లీలో పంజాబ్ బీజేపీ కీలక నేతల సమావేశం జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పంజాబ్ రాజకీయ పరిస్థితులు, రానున్న అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు కేవల్ సింగ్ ధిల్లాన్‌తో పాటు సునీల్ జాఖర్, కేంద్ర మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టు, రాణా గుర్మీత్ సింగ్ సోధీ, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, తరుణ్ చుగ్, అశ్వనీ శర్మ, ఇక్బాల్ సింగ్ లాల్‌పురా, పరమిందర్ సింగ్ బ్రార్, ఫతేజంగ్ సింగ్ బజ్వా తదితరులు హాజరయ్యారు.



**వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా!**

సమావేశం అనంతరం మాట్లాడిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్, పంజాబ్ ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో పాటు రాష్ట్ర భవిష్యత్తుపై సీరియస్‌గా చర్చించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల ముందుకు ఎలాంటి అంశాలతో వెళ్లాలన్న దానిపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. పంజాబ్ యువతను నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల వ్యాపారాన్ని మూలాలతో సహా నిర్మూలించడం తమ తొలి ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, రైతులు, వ్యాపారులు, ఉద్యోగుల హక్కులను కాపాడటం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా పనిచేస్తామని వెల్లడించారు.

పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు కేవల్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ, ప్రస్తుతం పొత్తుల అంశం చర్చలోనే లేదని స్పష్టం చేశారు. బీజేపీ మొత్తం 117 స్థానాల్లో పోటీ చేసి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పంజాబ్ అభివృద్ధే తమ ఏకైక అజెండా అని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. మాజీ ఆర్థిక మంత్రి, బీజేపీ నేత మన్‌ప్రీత్ సింగ్ బాదల్ మాట్లాడుతూ, పంజాబ్ ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రం కోల్పోయిన వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండే "డబుల్ ఇంజిన్" ప్రభుత్వంతో అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు.


ఇక సునీల్ జాఖర్ మాట్లాడుతూ, ఆప్ ప్రభుత్వం కాంగ్రెస్‌తో కలిసి పంజాబ్‌ను దోచుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రత్యామ్నాయంగా బీజేపీని బలమైన శక్తిగా నిలబెట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. బీజేపీ నేత పరమిందర్ సింగ్ బ్రార్ మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు సాధించిన అభివృద్ధి పనులను, పార్టీ విజన్‌ను పంజాబ్ ప్రజల ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. తమ పాలనలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి నమూనాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

**సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి?**

మరోవైపు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై కూడా బీజేపీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసులకే భద్రత లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పరిస్థితిని చక్కదిద్దుకునేందుకు ప్రస్తుత ప్రభుత్వానికి ఇక తక్కువ సమయమే మిగిలి ఉందని వ్యాఖ్యానించారు. ఈ సమావేశం ఇటీవల జరిగిన పంజాబ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. మొత్తం 1,977 వార్డుల్లో ఆప్ 958 వార్డులను గెలుచుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది. కాంగ్రెస్ 397 వార్డుల్లో విజయం సాధించగా, శిరోమణి అకాలీ దళ్ 191 వార్డులు గెలుచుకుంది. బీజేపీ 172 వార్డుల్లో మాత్రమే విజయం సాధించింది. అయితే ఈ ఫలితాలను అధిగమించి అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వాలనే లక్ష్యంతో బీజేపీ ముందుకెళ్తోంది. పొత్తులపై ఆధారపడకుండా సొంత బలంతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకుంది.

# ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియామకం

భారత తదుపరి ఆర్మీ చీఫ్?గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆర్మీ చీఫ్‌గా ఉన్న జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ కానున్న నేపథ్యంలో ధీరజ్ సేథ్ ఆ బాధ్యతలను చేపట్టనున్నారు. ఈనెల 30న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ఆర్మీ చీఫ్?గా బాధ్యతలు బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్?గా ఉన్న ఆయనకు సైనిక వ్యూహాల్లో అపారమైన అనుభవం ఉంది. ధీరజ్ సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి. ఆయన డిసెంబర్ 1986లో భారత సైన్యంలోని ఆర్మర్డ్ సాయుధ దళంలో చేరారు. దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ కాలంలో ఆయన సైన్యంలోని వివిధ విభాగాల్లో, పలు ప్రాంతాల్లో పనిచేశారు. ధీరజ్ సేథ్ తన కెరీర్‌లో కొన్ని కీలకమైన బాధ్యతలను నిర్వహించారు. ఎడారి సరిహద్దుల్లోని ఒక కీలకమైన ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించారు. పశ్చిమ ఆర్మర్డ్ బ్రిగేడ్ కమాండర్‌గా బాధ్యతలను నిర్వహించారు. జమ్ముకశ్మీర్ ప్రాంతంలో ఉగ్రవాద నిరోధక దళం కమాండర్‌గా పనిచేశారు. ఉగ్రవాదులను నిర్మూలించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించారు.



లెఫ్టినెంట్ జనరల్ హోదా పదోన్నతి పొందిన తరువాత భారత సైన్యానికి చెందిన అత్యంత శక్తివంతమైన ప్రధాన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన 'సుదర్శన్ చక్ర కోర్'కు కమాండర్‌గా వ్యవహరించడం ధీరజ్ సేథ్ కెరీర్‌లో కీలకమైన ఘట్టంగా చెప్పుకోవాలి. యుద్ధ వేళల్లో శత్రువులపై మెరుపుదాడి చేసే వ్యూహాలను రూపొందించడంలో 'సుదర్శన్ చక్ర కోర్ అత్యంత కీలకమైనది. ధీరజ్ సేథ్ కెరీర్‌లో అరుదైన గుర్తింపులను సొంతం చేసుకున్నారు. ఆర్మీ కమాండర్‌గా పదోన్నతి పొందిన తర్వాత భారత సైన్యంలోని రెండు అత్యంత కీలకమైన సౌత్ వెస్ట్రన్ కమాండ్, సదరన్ కమాండ్‌గా పని చేశారు. భారత ఆర్మీలో ఇలాంటి అవకాశం చాలా తక్కువ మంది అధికారులకు లభించింది.

**ఆపరేషన్ సింధూర్‌లోనూ**

పలు ఆపరేషన్‌లకు సంబంధించిన ప్రణాళికలు, దళాల నిర్వహణ, సైనిక సామర్థ్యాల అభివృద్ధిలో ధీరజ్ విశేషమైన కృషిచేశారు. గతేడాది పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం అత్యంత వ్యూహాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సమయంలో పుణె కేంద్రంగా ఉన్న సదరన్ కమాండ్‌కు ధీరజ్ నాయకత్వం వహించారు. అనంతరం పశ్చిమ సరిహద్దు వెంబడి నిర్వహించిన త్రివిధ దళాల సంయుక్త విన్యాసాలను సమన్వయం చేశారు. ముఖ్యంగా రాజస్థాన్ ఎడారి ప్రాంతంలో జరిగిన అతిపెద్ద త్రివిధ దళాల సంయుక్త విన్యాసం "ఎక్సర్‌సైజ్ త్రిశూల్"కు ఆయన పర్యవేక్షించారు. అంగోలాలోని ఐక్యరాజ్యసమితి శాంతి భద్రతా మిషన్‌లోనూ ఆయన సేవలందించారు. అలాగే, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను, భవిష్యత్ యుద్ధరంగంతో సమన్వయం చేయడంలో ఆయన చేసిన సేవలు కీలకమైనవి.

**ఇక ఉపేంద్ర ద్వివేది విషయానికొస్తే,**

భారత సైన్యాధిపతిగా విశేషమైన సేవలు అందించిన జనరల్ ఉపేంద్ర ద్వివేది, 2024 జూన్‌లో 30వ భారత ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయనున్నారు. దాదాపు 4 దశాబ్దాల పాటు సాగిన ఆయన మిలిటరీ కెరీర్‌లో ఎన్నో కీలక బాధ్యతలు చేపట్టారు. ఎన్నో కీలక ఆపరేషన్?లలో పాల్గొన్నారు. శత్రుమూకల ఆట కట్టించేందుకు, భవిష్యత్తులో వచ్చే ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆయన విశేషమైన కృషి చేశారు. చైనా, పాకిస్థాన్? సరిహద్దుల్లో రక్షణ వ్యూహాలను పర్యవేక్షించారు. కొన్ని సందర్భాల్లో పాకిస్థాన్?కు గట్టి హెచ్చరికలు చేశారు. సరిహద్దుల్లో ఉగ్రవాదానికి మద్దతు ఇస్తే తీవ్ర పరిణామాలుంటాయని, పాకిస్థాన్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపివేయాలని ఇటీవల ఆయన వార్నింగ్ ఇచ్చారు. ఇక, అమెరికాలోని ప్రతిష్టాత్మకమైన 'యూఎస్ ఆర్మీ వార్ కాలేజ్- ఇంటర్నేషనల్ హాల్ ఆఫ్ ఫేమ్'లో ఆయనకు చోటు దక్కింది. అంతేకాదు, ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న మూడో భారత సైనికాధికారిగా ఆయన నిలిచారు.

## ఐక్యంగా ఉండి ప్రజలను సంఘటితం చేస్తాం



2029 ఎన్నికలపై లోక్‌సభ ప్రతిపక్షనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇండియా' కూటమి 2029 ఎలక్షన్స్‌లో ఇప్పటికే విజయం సాధించిందని అన్నారు. గత సోమవారం దిల్లీలో జరిగిన ఇండి కూటమిలో తాను చేసిన ప్రసంగాన్ని రాహుల్ గాంధీ శనివారం షేర్ చేసుకున్నారు. ఈ క్రమంలో ఇండి కూటమిలో ఐక్యత ఆవశ్యకతను నొక్కి చెప్పారు. అలాగే తాము 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోలేదని, 2029 ఎన్నికల్లో ఇప్పటికే విజయం సాధించామని ఆయన పేర్కొన్నారు.

**ప్రసంగాన్ని అనువాదం చేసిన రాహుల్**

ఇటీవల జరిగిన ఇండి కూటమి సమవేశంలో తాను హిందీలో ప్రసంగం చేశానని చెప్పారు. అయితే దానిని కూటమి మిత్రపక్షాలు అనువాదం చేయమని అడిగాయని అందుకే ఆ స్పీచ్‌ను ట్రాన్స్లేట్ చేసి ఇవాళ అందిస్తున్నట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. జూన్ 8న జరిగిన కూటమి సమావేశంలో 20 మందికి పైగా నాయకుల ప్రసంగాలు, వ్యాఖ్యలు విన్న తర్వాత చివరగా తాను ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. "భారతదేశ ఆలోచనా విధానం, దేశ ఆత్మ సంక్షోభంలో ఉన్నప్పుడు, వ్యవస్థలు హస్తగతం చేసుకున్నప్పుడు, ప్రజల గొంతుక అణచివేసినప్పుడు, ఐక్యతతో కూడిన ప్రతిఘటన మాత్రమే ప్రభావవంతంగా పనిచేస్తుంది. నేను మళ్లీ చెబుతున్నా, మేం 2024 ఎన్నికల్లో ఓడిపోలేదు. ఇక 2029 ఎన్నికల్లోనూ మేం ఇప్పటికే విజయం సాధించాం. ఐక్యంగా ఉండి ప్రజలను సంఘటితం చేస్తాం. అలాగే బీజేపీని, అది భారతదేశ వ్యవస్థలను తన గుప్పిట్లోకి తీసుకోవడంపై మేం ప్రతిఘటిస్తాం" అని ఇండి కూటమి మీటింగ్?లో తన హిందీ ప్రసంగాన్ని ట్రాన్స్లేట్ చేస్తూ రాహుల్ ఎక్స్‌లో ట్వీట్ షేర్ చేశారు.

అలాగే దేశ ప్రజలు ప్రస్తుతం అధికార ఎన్‌డీఏపై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని, అది చూస్తే రానున్న 2029 పార్లమెంట్ ఎన్నికల్లో విజయం విజయం తమదే అని కూటమి పక్షాలతో రాహుల్ చెప్పారు. అయితే స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగకపోవడం వల్లే పోటీలో గెలవలేకపోతున్నామని అన్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష నాయకులు ఐక్యంగా ఉండాలని గాంధీ పిలుపునిచ్చారు. కూటమిలోని అందరూ కలిసి నిలబడి ప్రతిఘటిస్తే, అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని సులభంగా ఓడించవచ్చని రాహుల్ అన్నారు.

ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఇండి కూటమికి డీఎంకే దూరమైందని ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా దీనిపైనా రాహుల్ స్పందించారు. ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం లేదన్న అభిప్రాయాన్ని రాహుల్ తోసిపుచ్చారు. ఇదంతా బీజేపీ చేస్తున్న ఫేక్ ప్రచారం అని అన్నారు. 'ఇవి బీజేపీ చేస్తున్న ఫేక్ ప్రచారాలు. ఇందులో ఏ మాత్రం నిజం లేదు. డీఎంకే విషయంలో నేను ఇప్పుడే హామీ ఇవ్వగలను. భారతదేశ భావనను కాపాడే విషయానికి వస్తే, ఈ కూటమిలో ఉన్న ప్రతి ఒక్కరూ కలిసి వస్తారని నాకు 100 శాతం నమ్మకం ఉంది' అని రాహుల్ పేర్కొన్నారు.

## 'ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల బలోపేతమే లక్ష్యం'



ఐరోపా దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయలుదేరారు. వారం రోజుల పాటు ఫ్రాన్స్, స్లోవేకియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో రెండు దేశాలతో ఉన్న వ్యూహాత్మక, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఉంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్, స్లోవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో ఆహ్వానం మేరు ఈ రెండు దేశాలు పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా మొదటిగా ప్రధాని మోదీ, ఫ్రాన్స్‌లోని నీస్ నగరాన్ని సందర్శించి అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్?తో సమావేశం కానున్నారు. ఈ భేటీలో భారత్--ఫ్రాన్స్ సంబంధాల మొత్తం పరిధిని సమీక్షించనున్నారు. తన ప్రయాణానికి ముందు విడుదల చేసిన ప్రకటనలో మోదీ, ఫ్రాన్స్ భారత్ వ్యూహాత్మక దృష్టిలో ప్రత్యేక స్థానం కలిగి ఉందని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలు గతంలో మరింత బలపడినట్లు ఆయన తెలిపారు. ఇటీవల ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్?తో భారత్ పర్యటన చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇరుదేశాలు 'స్పెషల్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్' దశకు చేరుకున్నాయని ఆయన అన్నారు.

**'భారత్ ఇన్నోవేట్స్' ప్రారంభం- స్టార్టప్‌లకు గ్లోబల్ వేదిక**

జూన్? 14న ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్?తో కలిసి 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రధాని తెలిపారు. భారత్--ఫ్రాన్స్ ఇన్నోవేషన్ సంవత్సరానికి అనుగుణంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ వేదిక ద్వారా భారత్‌లోని అత్యుత్తమ స్టార్టప్‌లకు అంతర్జాతీయ పెట్టుబడిదారులతో నేరుగా అనుసంధానం కల్పించబడుతుంది. భారత ఉన్నత విద్యా వ్యవస్థ నుంచి వెలువడుతున్న ఆవిష్కరణలను ప్రపంచ మార్కెట్‌కు తీసుకెళ్లే ప్రధాన వేదికగా ఇది మారనుందని ఆయన అన్నారు.

**భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందంపై వేగం**

భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందంపై చర్చలు మరింత వేగం పుంజుకోనున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. స్లోవేకియా ఈయూలో కీలక సభ్యదేశంగా ఉండటంతో ఈ పర్యటన వ్యూహాత్మకంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుందని తెలిపారు. భారత్-ఈయూ మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చర్చలు కొనసాగుతాయని ఆయన చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి రంగాల్లో సహకారం మరింత విస్తరించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు.

**వివాటెక్ 2026లో భారత్ హవా**

ఫ్రాన్స్ పర్యటన చివరి దశలో పారిస్‌లో జరగనున్న వివాటెక్ 2026 కార్యక్రమంలో కూడా ప్రధాని పాల్గొననున్నారు. ఇది యూరప్‌లో అతిపెద్ద టెక్నాలజీ, ఇన్నోవేషన్ సమావేశంగా గుర్తింపు పొందింది. ఈసారి భారత్‌కు అతిపెద్ద జాతీయ పెవిలియన్ లభించడం దేశ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు అంతర్జాతీయ గుర్తింపు పెరుగుతోందని సూచిస్తుందని మోదీ తెలిపారు. భారత్--యూరప్ ఇన్నోవేషన్ భాగస్వామ్యానికి ఇది కొత్త దిశను ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే పారిస్‌లో నివసిస్తున్న భారతీయ కమ్యూనిటీ సభ్యులతో సమావేశం కావాలని తాను ఎదురుచూస్తున్నట్లు ప్రధాని చెప్పారు. వారు రెండు దేశాల మధ్య సాంస్కృతిక, సామాజిక వారధిగా పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు.

**స్లోవేకియాలో చారిత్రక తొలి పర్యటన**

ఫ్రాన్స్ అనంతరం ప్రధాని మోదీ జూన్ 14-15 తేదీల్లో స్లోవేకియా రిపబ్లిక్‌కు రాష్ట్ర పర్యటన చేయనున్నారు. 1993లో ఆ దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత అక్కడ పర్యటించే తొలి భారత ప్రధాని కావడం ఈ పర్యటన ప్రత్యేకత. అక్కడ అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని, అలాగే ప్రధాని రాబర్ట్ ఫికోతో మోదీ చర్చలు జరపనున్నారు. స్లోవేకియా వ్యాపార నాయకులతో కూడా సమావేశం కానున్నారు.

**జీ7 సదస్సులో భారత్ స్వరం**

స్లోవేకియా పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జూన్ 16, 17 తేదీల్లో జరగనున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు. భారత్‌కు వరుసగా ఎనిమిదోసారి ఆహ్వానం లభించడం దేశానికి లభిస్తున్న అంతర్జాతీయ విశ్వాసానికి నిదర్శనమని ప్రధాని మోదీ తెలిపారు. భారత్ పెరుగుతున్న గ్లోబల్ ప్రొఫైల్, ఆర్థిక శక్తి, డిప్లొమాటిక్ ప్రభావం ఈ ఆహ్వానాల ద్వారా స్పష్టమవుతోందని ఆయన అన్నారు. జీ7 సదస్సులో భారత్ తన స్వరం మాత్రమే కాదు, గ్లోబల్ సౌత్ ఆశయాలకు కూడా ప్రతినిధిగా నిలుస్తుందని అని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ దక్షిణ భాగంలోని దేశాలు ఎదుర్కొంటున్న అభివృద్ధి సవాళ్లను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్లడం భారత్ బాధ్యతగా భావిస్తోందని ఆయన తెలిపారు.

# గూడుపుమ్మ తల్లి ఆలయంలో ఉపాధి కూలీల శ్రమదానం





**నక్కపల్లి, పెన్ సత్తా,జూన్ 13 :** మండలంలోని రేబాక గూడుపమ్మ తల్లి ఆలయ ప్రాంగణం, పరిసరాలను రెండు రోజుల పాటు ఆ గ్రామ ఉపాధి కూలీలు శ్రమదానంతో శుభ్రం చేశారు. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో వున్న ఈ అమ్మవారి ఆలయ పరిసరాలను స్వచ్ఛందంగా, ఉపాధి పనుల అనంతరం శ్రమదానంతో కూలీలు శుభ్రం చేశారు. అనేక వ్యర్థాలను తొలగించారు. శుక్ర, శనివారం రెండు రోజుల పాటు శ్రమదానం చేయడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడుతూ కన్పిస్తోంది. అమ్మవారి ఆలయానికి ఆది, మంగళ, గురు, శుక్రవారాల్లో అనేక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ముక్కులు తీర్చుకుంటారు. అంతేకాకుండా కొంతమంది భక్తులు అమ్మవారి ఆలయం వద్ద వంటలు వండుకుని భోజనాలు చేస్తారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా శ్రమదానం చేసిన ఉపాధి కూలీలను గ్రామ పెద్దలు, పలువురు అమ్మవారి భక్తులు అభినందించారు.



# ఘనంగా శని త్రయోదశి పూజలు

**నక్కపల్లి, పెన్ సత్తా,జూన్ 13 :** మండలంలోని ఉపమాక శివాలయం వద్ద శనిత్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక

పూజలు జరిగాయి. నవ గ్రహ మండపం వద్ద శనైశ్చరుడికి ఆలయ అర్చకులు వెల్లంపల్లి మహేశ్ ఆధ్వర్యంలో తిల. తైలాభిషేకాలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. రేబాక గూడుపమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో వున్న శనైశ్చరుడి మందిరం వద్ద తిల, తైలాభిషేకం చేశారు. దశరథ కృత శని స్తోత్రం, శని గ్రహ అష్టోత్తరం, శని బీజ మంత్రం,పిప్పలాద కృత శనిస్తోత్ర పఠనం చేపట్టారు.అనంతరం స్వామివారికి హారతులిచ్చారు. అనేక మంది భక్తులు శనైశ్చరుడిని దర్శించుకున్నారు.



## ఆర్జీకే సమస్యలపై ఎమ్మెల్యే వివేకానంద, మాజీ కార్పొరేటర్ జగన్ పర్యటన.....

**త్రాగునీరు, డ్రైనేజీ, చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం.**



**కుత్బుల్లాపూర్, పెన్ సత్తా,జూన్ 13**జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) సదాయంలో నెలకొన్న పలు సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, స్థానిక మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శనివారం కాలనీలో పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ధర్మారపు అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, కాలనీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కాలనీ వాసులు ప్రధానంగా త్రాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, అలాగే జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల షాపుల తొలగింపు, సంక్షేమ సంఘం భవన నిర్మాణం,రోడ్లు తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. త్రాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి కాలనీ ప్రజలకు ఉపశమనం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. చిరు వ్యాపారుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే, ఉపాధి కోసం చిన్న చిన్న షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వారి జీవనోపాధి దెబ్బతినకుండా పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ త్రాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని, అలాగే చిరు వ్యాపారుల సమస్యను సానుకూలంగా పరిశీలించి వారికి ఇబ్బందులు కలగకుండా చూడటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.


ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతీ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి

**పెన్ సత్తా,జూన్ 13** నర్సంపేట:ప్రభుత్వంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతీ ఉద్యోగికి బదిలీ అనేది తప్పనిసరి అని దుగ్గొండి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపిడిఓ డాక్టర్ లెక్కల అరుంధతి అన్నారు.దుగ్గొండి మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించిన మండల పంచాయతీ అధికారి మోడెం శ్రీధర్ గౌడ్ నెక్కొండకు బదిలీపై వెళ్లగా,జూనియర్ అసిస్టెంట్ శత్రజ్ఞ రెడ్డి గీసుకొండ సీనియర్ అసిస్టెంట్ గా ప్రమోషన్ గా వెళ్ళారు.అలాగే సీనియర్ అసిస్టెంట్ ,టైపిస్ట్,ఇద్దరు అరెండర్స్,13 మంది పంచాయతీ కార్యదర్శులు వివిధ ప్రాంతాలకు బదిలీలపై వెళ్ళగా ఎంపీఓ, సీనియర్,జూనియర్ అసిస్టెంట్లు,సిబ్బంది 14 మంది పంచాయతీ కార్యదర్శులు కొలువుతీరారు.ఈ నేపథ్యంలో దుగ్గొండి నుండి ప్రమోషన్,బదిలీలపై వెళ్ళిన,దుగ్గొండి మండలానికి నూతనంగా వచ్చిన అదికారులు,సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం మండలంలోని గిర్నిబావిలో వీడ్కోలు,స్వాగతం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డాక్టర్ లెక్కల అరుంధతి మాట్లాడుతూ కొన్ని మండలంలో విధులు నిర్వర్తించిన విధంగానే నిజాయితీగా పనిచేయాలని సూచించారు.గతంలో అభివృద్ధి పట్ల అధికారులు,కార్యదర్శులు పని చేసారు.నిబంధనల ప్రకారంగా నిధులు నిర్వర్తించుకోవాలి. ప్రజలకు సేవలు అందించడంతోపాటు జవాబుదారితనంగా వ్యవహరించాలని నూతనంగా కొలువుదీరిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నెక్కొండ మండలానికి బదిలీపై వెళ్లిన ఎంపీఓ శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ అందరి సహకారంతో విధులు నిర్వహించిన. నూతనంగా విధులు నిర్వహించే అధికారులకు కూడా సహకరించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం మండలానికి వచ్చిన అధికారులు పంచాయతీ కార్యదర్శులకు శాలువాలతో సన్మానం పలికి బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరిండెండెంట్ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరి ప్రసాద్, కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు కొండల్ రెడ్డి,వేణు,సంతోష్,పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, రాజేంద్రప్రసాద్, రమేష్, దేవేందర్, రాజేష్,అశోక్ రెడ్డి పలువురు అధికారులకు కార్యదర్శిలు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటికి మండలం నుండి 7గురు విద్యార్థుల ఎంపిక

* మండలవిద్యాశాఖాధికారి1 కే.నరేష్



**నక్కపల్లి, పెన్ సత్తా జూన్ 13:**ఆంధ్రప్రదేశ్ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ పరిధిలో ట్రిపు

ల్ ఐటీ క్యాంపస్ లలో 2026-27 విద్యాసంవత్సర ప్రవేశాలకు నక్కపల్లి మండలం నుండి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని మండల విద్యాశాఖ అధికారులు కె. నరేష్, ఆర్ నాగన్నదొర లు తెలిపారు. దీనికి సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితా శనివారం విడుదల అయిందని దీనిలో నక్కపల్లి మండలం నుండి 07 గురు విద్యార్థులు ఎంపిక అవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిహెచ్. రేణుక దేవి, ఎ.యశస్విని లు నూజివీడు, దేవవరపు దుర్గాప్రసాద్, వి. శ్రీ వెంకట అపర్ణ, కె. సిద్దు, జి. దేవిశ్రీ లు శ్రీకాకుళం, బొంది కుసుమ ఒంగోలు క్యాంపస్ లకు ఎంపిక కాబడినట్లు స్థానిక విలేకర్లకు వారు తెలిపారు.ఎంపిక కాబడిన విద్యార్థులు ఆరు సంవత్సరాలు కళాశాలలో కోర్సు పూర్తిచేయవలసి ఉంటుందన్నారు.2026 మార్చిలో పదవ తరగతిలో మండలంలో టాప్ లో ఉన్న విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కి ఎంపికయ్యారని,వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు,తల్లిదండ్రులను వారు అభినందించారు.తమ పిల్లలు ట్రిపుల్ ఐటికి ఎంపిక కావడం ఎంతో కాలంగా తాము కలగన్నామని నేటికి అది సాకారమైందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు .గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇది ఒక వరం అని వారు పేర్కొన్నారు.ఈ కళాశాలల్లో సీటు పొంది చదువుకున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని,అనడంలో సందేహంలేదని,బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు.విద్యాశాఖ విడుదలచేసిన జాబితాలో స్థానిక బాలికల హైస్కూల్ నుండి ముగ్గురు, వేంపాడు హైస్కూల్ నుండి ఒకరు,గొడిచర్ల హైస్కూల్ నుండి ఇద్దరు నక్కపల్లి కో ఎడ్యుకేషన్ పాఠశాలనుండి ఒకరు ఎంపికయ్యారని నరేష్ తెలిపారు.ఎంపికయినవిద్యార్థులను వివిధ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వేమగిరి నూకరాజు,శ్రీలక్ష్మి, సత్యకుమార్ ,వి.బాలాజీ,యు.వరలక్ష్మి, పతివాడ విజయ,బషీర్ ఖాన్, సంధ్యారాణి, ఎస్.జయశ్రీ లతో పాటు స్థానిక గ్రామపెద్దలు,తల్లిదండ్రులు అభినందించారు

## యూరియా యాప్ వినియోగంపై అవగాహన.

## జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర

**మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెన్ సత్తా,జూన్ 13**జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయ చంద్ర,మండల వ్యవసాయ అధికారి కే.రాజుతో కలిసి బయ్యారం మండలంలోని కొత్తపేట నుండి మిర్యాలపెంట వరకు ఏజెన్సీ గ్రామాలను సందర్శించి,రైతులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో యూరియా యాప్ పనితీరును పరిశీలించి,రైతులకు యాప్ ద్వారా యూరియా బుకింగ్ విధానం,దాని ప్రయోజనాలు,పారదర్శకత గురించి రైతులకు వివరించారు.అల్లిగూడెం,పందిపంపుల గ్రామాలలో రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి యూరియా యాప్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పించారు.యాప్ ద్వారా రైతులు సులభంగా యూరియా బుకింగ్ చేసుకోవచ్చని,ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా జరుగుతుందని వివరించారు.

అనంతరం అల్లిగూడెం గ్రామ సర్పంచ్ చింత ప్రసాద్ తో సమావేశమై గ్రామంలోని వ్యవసాయ పరిస్థితులను తెలుసుకున్నారు.పంటల వైవిధ్యీకరణలో భాగంగా రానున్న వానాకాలంలో మొక్కజొన్న సాగు నుండి ఆయిల్ పామ్ సాగుకు మారేందుకు ముందుకు వచ్చిన రైతులు అవిరె నారాయణ, మురళీకృష్ణ తదితరులను జిల్లా వ్యవసాయ అధికారి ప్రత్యేకంగా అభినందించారు.ఇతర రైతులు కూడా అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి పంట అవశేషాల దహనం వల్ల నేల సారం తగ్గిపోవడం, పర్యావరణ కాలుష్యం పెరగడం, భూసార జీవులు నశించడం వంటి దుష్పరిణామాలను రైతులకు వివరించారు.అదేవిధంగా పంటల వైవిధ్యీకరణ అవసరాన్ని నొక్కి చెబుతూ,నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,లైసెన్స్ పొందిన విత్తన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.యూరియా ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, సమీకృత పోషక నిర్వహణ పద్ధతులను అవలంబించాలని, నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం ద్వారా ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

PEN SATTA
Telugu Daily

పెన్ సత్తా

ఆదివారం 14 జూన్ 2026

## అర్ధరాత్రి అక్రమ మట్టి రవాణాపై పోలీసుల దాడి..!

- రెండు మట్టి లారీలు పట్టివేత.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా,జూన్ 13**బూర్గంపాడు మండలం నుండి భద్రాచలం పట్టణానికి ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి సమయంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు మట్టి లారీలను భద్రాచలం పోలీసులు గత రాత్రి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.
అనుమతులు లేకుండా మట్టి రవాణా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమై చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.
పట్టుబడిన లారీలు, వాటి యజమానులు మరియు అక్రమ మట్టి రవాణాకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు మరింత విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.
ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

## జూన్ 15 నుంచి పాఠశాలలు పునః ప్రారంభానికి సిద్ధం...

- విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాము...
- మండల విద్యాధికారి తోట మల్ల రమ....



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా,జూన్ 13**భద్రాచలం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశాన్ని భద్రాచలం మండల విద్యాధికారి తోటమల్ల రమ అధ్యక్షతన నిర్వహించినారు. జూన్ 15వ తారీకు నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నాయని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు .తాగునీటి వసతి మరుగుదొడ్లు ,పరిశుభ్రతతో పాటు ఇతర సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు , ఇప్పటికే పాఠ్యపుస్తకాలు ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. తొలి రోజు నుంచే మధ్యాహ్న భోజనము, రాగి జావా ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు.

## తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా దోసపాటి.

- ప్రమాణ స్వీకారం చేసిన ఎస్ కె టి గ్రూప్స్ అధినేత దోసపాటి వెంకటేశ్వరావు.



**భద్రాద్రి కొత్తగూడెం పెన్ సత్తా,జూన్ 13**తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఎస్ కె టీ గ్రూప్ సంస్థల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరావు.. భక్తుల కోసం తిరుమలలో తెలంగాణ భవనం నిర్మాణం చేయదలిచి దాని కోసం చైర్మన్ గా తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు అమరవది లక్ష్మి నారాయణ ఆంధ్ర ప్రదేశ్ రాజకీయవేత్త ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ వెంకటేష్ చేతుల మీదుగా తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా నియామక పత్రం అందుకున్న ఎస్ కె టీ గ్రూప్ సంస్థల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరావు. ఈ సందర్భంగా దోసపాటి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి తిరుపతిలో తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా బాధ్యతలను వమ్ము చేయకుండా తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ భక్తుల కొరకు తిరుపతిలో భవన నిర్మాణం చైర్మన్గా బాధ్యతలు నిర్వహిస్తానని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లాల నుండి ఆర్య వైశ్యులు పాల్గొన్నారు

# గ్రామ రహదారుల అభివృద్ధికి సహకరించాలి

గ్రామ సామాజిక సేవాకర్త ధరావత్ నరసింహ

**చింతలపాలెం మండలం పెన్ సత్తా,జూన్ 13**మండల పరిధిలో ఉన్నఎర్రకుంట తండా గ్రామానికి చెందిన రైతులు మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ నిర్మాణం కోసం తమ భూములను కోల్పోయి ప్రాజెక్టుకు సహకరించామని తెలిపారు. అయితే గ్రామంలోని రహదారులు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
పైప్‌లైన్ పనుల సందర్భంగా లభించిన మట్టిని గ్రామ రహదారులపై వేయించి రాకపోకలకు అనువుగా మార్చాలని లిఫ్ట్ కాంట్రాక్టర్లకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన గ్రామాలకు ప్రాధాన్యతనిస్తూ కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో రైతులు పాడియా శంకర్, లావూరి వెంకటేశ్వర్లు, వంకుడోతు రాముడు, భూక్య శంకర్, బంజారా జేఏసీ నాయకులు ధరావత్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా పార్టీ అధ్యక్షులు జన్మదిన వేడుకలు

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి

**గరిడేపల్లి పెన్ సత్తా,జూన్ 13**మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగు లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలను గరిడేపల్లి మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హుజూర్‌నగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా కడియం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, సూర్యాపేట బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ రాజ్యసభ సభ్యులుబడుగులలింగయ్య యాదవ్ సామాజిక న్యాయం, బీసీ వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకుంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు



చోటుచేసుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.
కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు బడుగు లింగయ్య యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్‌ను పంపిణీ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో గరిడేపల్లి మాజీ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రధాని సైదులు, మాజీ ఎంపీటీసీ కడియం స్వప్న, హుజూర్‌నగర్ నియోజకవర్గ నాయకులు పెండెం వెంకట రాములు, షేక్ రాజమహమ్మద్, బండ్ల గోపాల్, మామిడి కాశి అంజయ్య, పెండెం వినోద్, పెండెం శంకర్, పెండెం శ్రీను, పెండెం ధనయ్య, రెబ్బ శివ, ఆదం, పిట్ట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్ శంకుస్థాపన



జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామంజిగౌడ్

**గరిడేపల్లి పెన్ సత్తా,జూన్ 13**మండల పరిధిలో ఉన్న రాయినిగూడెం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్ గ్రామ సర్పంచ్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్
తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాలలోమౌలిక సదుపాయాలు ఉన్నాయని దృష్టిలో పెట్టుకొని మారుమూల గ్రామాలకు రోడ్లు అయితేనేమి ఎస్సీ కమ్యూనిటీ హాల్ అయితేనేమి గ్రంథాలయాలు అయితేనేమి గ్రామపంచాయతీ బిల్డింగులు అయితేనేమి అంగన్వాడిబిల్డింగులు అయితేనేమ విలేజి లల్లో ఏది ప్రాబ్లం ఉందని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిదృష్టికి తెలియపరచగానే వెంటనే శాంక్షన్ చేసి మారుమూల గ్రామాలలో బిల్డింగులు శాంక్షన్ చేపిస్తున్న అపర భగీరథుడు మన మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో రాయినిగూడెంలో గ్రామపంచాయతీ బిల్డింగ్ శంకుస్థాపన చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఏఈ కీత కళ్యాణ్ మరియుపిఎసిఏ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ మాజీ ఎంపిటిసి బాల్దూరి సందీప్ మాజీ సర్పంచ్లు కడప దేవదానం దోసపాటి స్వరూపాభిక్షం గ్రామ శాఖ అధ్యక్షుడు గుండు శంభయ్య యూత్ అధ్యక్షుడు గుండు అశోక్ గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు గుండు లక్ష్మమ్మ గురవయ్య అమరారపు తిమోతి రాజు గుండు ఉషారాణి పిడమర్తి ఈశ్వరమ్మ శ్రీనివాస్ రాచమల్ల శ్రీకాంత్ కాంపాటి రాజు మేకపోతుల రాంబాబు గుండు అంజయ్య బాలయ్య గుండు వెంకన్న గంట లింగయ్య మరియు గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## పులిపలుపుల రాములు గౌడ్ .... సౌజన్యంతో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుని నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేత.

**మండలంపెన్ సత్తా,జూన్ 13 ప్రతినిధి** వలిగొండ మండలం, మొగిలిపాక గ్రామానికి చెందిన మన మూగ, చెవిటి సోదరుడు మచ్చ కృష్ణ (తండ్రి: నరసింహ) ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పైకప్పు కొరకు 40.000 వేలు విలువచేసే ఇనుము సామాగ్రిని తన సొంత ఖర్చు తో ఇప్పించారు
ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మామిడి సత్తిరెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పబ్బు ఎల్లయ్య , మరియు నిషాకర్ రెడ్డి , ఉక్కుర్తి ఎల్లయ్య, సింగం శ్రీను ముద్దసాని నవీన్ రెడ్డి మొగిలి పాక పరశురామ్ చెన్నారం మహేష్ ఉక్కుర్తి నవీన్ మొగిలిపాక శ్రీకాంత్ గుండాల సాయిరాం తొండల కార్తిక్ జడిగ గణేశ్ భీమనబోయిన సాయికుమార్ జడిగా బన్నీ పాల్గొన్నారు. పేద, దివ్యాంగ



కుటుంబానికి కొండంత అండగా నిలిచిన రాములు గౌడ్ కి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు

## కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుని సన్మానించిన కెర్చుపల్లి నాయకులు.



**వలిగొండ మండలం పెన్ సత్తా,జూన్ 13**నూతన అధ్యక్షులకి సన్మానం చేయడం జరిగింది మండల అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, వలిగొండ టౌన్ అధ్యక్షులు పోలేపాక జానకి రాము గారికి సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి లోడే శ్రీకాంత్, మండల సీనియర్ నాయకులు బర్మా జంగయ్య, ఉంగురాల సోమయ్య,గ్రామశాఖ ఉపాధ్యక్షులు ఏనుగు జంగారెడ్డి,గ్రామశాఖ కార్యదర్శి చిన్నం రాములు, యూత్ కాంగ్రెస్ నాయకులు దయ్యాల బాల వికాస్ పాల్గొన్నారు

## ఎలెక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ భద్రాచలం రెండవ నూతన కమిటీ ఎన్నిక.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా,జూన్ 13**సర్వ సభ్యసమావేశంలో పాల్గొన్న 20 మంది ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఏకగ్రీవంగా నూతన కమిటీ నీ ఎన్నుకున్నారు రెండవ నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు కుప్పాల నాగరాజు,గౌరవ సలహాదారులు పూనెం ప్రదీప్ ఆధ్వర్యంలో రెండవ నూతన కమిటీ ని ఎన్నుకున్నారు.రెండవ నూతన కమిటీ ఎలెక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పోకల శ్రీనివాస్ ,కార్యదర్శిగా చెట్టి జస్వంత్ , కోశాధికారి గా లంకా రాజేష్ ,ఉపాధ్యక్షుడు తమ్మల్ల రాజేష్ ,సహాయ కార్యదర్శిగా పోలిశెట్టి రాజు (స్వతంత్ర టీవీ) ప్రతినిధులను ఎన్నుకున్నారు. గత ఏడాది మీడియా ప్రెస్ క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో బాధ్యతలు నిర్వహించిన మొదటి కమిటీ ధన్యవాదాలు తెలిపారు. .
ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకున్న కొత్త కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో అందరికీ అందుబాటులో ఉంటూ,ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి,అధికారులకు తెలియచేస్తూ ప్రజా సమస్యల పరిష్కరించే దిశగా కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపారు.
ప్రజా సమస్యలను మీడియా ప్రెస్ క్లబ్ కి తెలియచేయాలని,మీడియా ప్రెస్ క్లబ్ అందుబాటులో ఉంటుంది అని తెలిపారు...

## పోరాడి సాధించిన తెలంగాణరాష్ట్రంలో మహిళలలకు భద్రత కరువు

- బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు గుగులోతు నీలా హేమ్లా నాయక్




**గరిడేపల్లి పెన్ సత్తా,జూన్ 13** ఉద్యమాలు చేసి పోరాడి సాధించిన తెలంగాణరాష్ట్రంలో మహిళల భద్రత కరువైందని బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు గుగులోతు నీలా హేమ్లా నాయక్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని చెబుతున్నారు కోటీశ్వరులు చేయడం కాదు. ముందు వారిపై సరైన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ మహిళలకు ఇచ్చినటువంటి నాటి హామీలునుంచి మహిళలపై దాడులు అగహిత్యాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు అంగన్వాడీ సిబ్బంది కి వేతనాలు రాక ఆకలితో అలమటిస్తున్నారని వాపోయారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫ్లమైంది. మహిళలకు యువకులకు ఇస్తామన్న 2500 రూపాయలు,స్కూటీలు,తులం బంగారం కౌలు రైతులకు 12000 వృద్ధాప్యంలో నాలుగు వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు తక్షణమే ఇవ్వాలని ఇవ్వని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక ధర్నాలు రాస్తూరోకలు చేస్తామని హెచ్చరించారు.

# బదిలీ పై వెళ్లిన పంచాయతీ కార్యదర్శుల కు వీడ్కోలు సన్మానం

**నూతన కార్యదర్శులకు స్వాగత సన్మానం**

**:నర్సంపేట పెన్ సత్తా,జూన్ 13** :ఘనంగా పంచాయతీ కార్యదర్శుల వీడ్కోలు సన్మాన సభ , ఇటీవల బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులకు వీడ్కోలు సన్మానం నూతన కార్యదర్శులకు స్వాగత సన్మాన కార్యక్రమం శుక్రవారం రోజు గిర్నిబావి జిబిఆర్ ఫంక్షన్ హాల్ వద్ద అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో లెక్కల అరుంధతి హాజరై పంచాయతీ కార్యదర్శుల
సేవలను కొనియాడుతూ,
ఈ సందర్భంగా ఎంపీడీవో అరుంధతి మాట్లాడుతూ... కార్యదర్శులు తమ పదవీ కాలంలో గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.ప్రజలతో ఎంతో స్నేహపూర్వకంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించారని గుర్తుచేసుకున్నారు.

**ఘన సన్మానం:**

అనంతరం బదిలీపై వెళ్తున్న ప్రతి ఒక్క కార్యదర్శి కి శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.
భావోద్వేగానికి గురైన కార్యదర్శి
సన్మానం అనంతరం కార్యదర్శి మాట్లాడుతూ... దుగ్గొండి మండలంలోని రేకంపల్లి గ్రామంలో పనిచేయడం తనకు ఎంతో తృప్తిని ఇచ్చిందని, ఐదు సంవత్సరాల నాలుగు నెలలు సుదీర్ఘకాలం పనిచేశానని తన విధులకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, పంచాయతీ సిబ్బందికి గ్రామ ప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.ఇక్కడి ప్రజలు చూపిన ఆదరాభిమానాలను ఎప్పటికీ మరచిపోలేనని భావోద్వేగానికి గురయ్యారు.?ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు గ్రామ ప్రజలు పాల్గొని కార్యదర్శి కి శుభాకాంక్షలు తెలిపారు.
గ్రామ పంచాయతీ కార్యదర్శిగా మీరు అందించిన సేవలు అనన్యసామాన్యం.విధి నిర్వహణలో మీరు చూపిన అంకితభావం,క్రమశిక్షణ, గ్రామాభివృద్ధిపై మీకున్న తపన మారుమూల గ్రామాన్ని సైతం ప్రగతి పథంలో నడిపించాయి.
ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తూ,ప్రజల మన్ననలు పొంది, అందరి గుండెల్లో ఒక మంచి అధికారిగా స్థానం సంపాదించుకున్నారు.మీతో కలిసి పనిచేయడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాము.
బదిలీపై వెళ్తున్న మీకు మా గ్రామ ప్రజల తరపున, ప్రజాప్రతినిధుల తరపున హృదయపూర్వక వీడ్కోలు పలుకుతూ... మీరు వెళ్లే నూతన ప్రాంతంలో కూడా ఇలాగే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.





## వేణు మృతదేహానికి నివాళులర్పించిన:మాజీ ఎమ్మెల్యే పెద్ది





**దుగ్గొండి పెన్ సత్తా,జూన్ 13:**వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం రేకంపల్లి గ్రామంలో బి ఆర్ ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నీరట మురళి తమ్ముడు నీరటి వేణు జూన్ 11 గురువారం రోజున రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శుక్రవారం సాయంకాలం మరణించడం జరిగినది, విషయం తెలుసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి వారి వేణు పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు.మృతుడి కుటుంబానికి మేమున్నామని ధైర్యం భరోసా ఇవ్వడం జరిగినది,

ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుకినే రాజేశ్వరరావు,మాజీ మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి,మాజీ ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య , యూత్ కన్వీనర్ శాన బోయిన రాజ్ కుమార్,మాజీ సర్పంచ్ ఇమ్మడి యుగేందర్,ఉప సర్పంచ్ పొన్నం వంశీ,వార్డ్ మెంబర్ ఇజ్జగిరి రాజన్న ,తౌటు విజయ రవి, ఇసంపల్లి సులోచన సుమన్, ఇజ్జగిరి రంజిత్,ఈసంపల్లి రాజు, గ్రామ పార్టీ యూత్ అధ్యక్షులు జన్ను మనోజ్,సీనియర్ కార్యకర్తలు రాజకుమార్,భాస్కర్, తిరుపతి,శానబోయిన నరసింహ స్వామి,యూత్ సభ్యులు యాట నరేష్, మహేందర్ ,నరేష్, తదితరులు పాల్గొన్నారు,

## బాసర త్రిపుల్ ఐటీకి కుసంగి ఒక స్కూల్ నుండే ముగ్గురు విద్యార్థుల ఎంపిక

- ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం
- ప్రధానోపాధ్యాయురాలు బి ప్రసన్న వదన




**టేక్మాల్ పెన్ సత్తా,జూన్ 13** మెదక్ జిల్లా టేక్మాల్ మండలం పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుసంగి నుండి పి.నిఖిల్, హీన, బి.లావణ్య ముగ్గురు విద్యార్థులు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బాసరలో ప్రవేశాలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి ప్రసన్న వదన తెలిపారు. మారుమూల ప్రాంతం నుండి త్రిబుల్ ఐటీ కి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎంపికకు ప్రధానోపాధ్యాయురాలు మరియు ఉపాధ్యాయ బృందం చేసిన నిరంతర కృషి, ప్రణాళిక బద్ధమైన బోధన, ప్రత్యేక తరగతుల నిర్వహణ, పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయం అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా రాష్ట్రస్థాయి విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం పాఠశాల ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు,విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు , ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు తెలిపారు.

## చెక్‌పవర్ రద్దు ఆలోచన ఉపసంహరించుకోవాలి.

- ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి.



**మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెన్ సత్తా,జూన్ 13** ఉపసర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని జగ్గుతండ ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో వీరస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపసర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేయాలని చూస్తున్నదని,వెంటనే ఆ ఆలోచనను విరమించుకోవాలని కోరారు.లేనిపక్షంలో మండల ఉపసర్పంచ్ ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చెపడతామని పేర్కొన్నారు.అదేవిధంగా ఉపసర్పంచ్ ల సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తామని,ప్రభుత్వం దిగివచ్చే వరకూ ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

# వ్యాధుల నియంత్రణకు ముందడుగు

**కుసంగి గ్రామంలోని బైపాస్ రోడ్డు లో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలను తొలగించిన గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గం**




**టేక్మాల్ పెన్ సత్తా,జూన్ 13** మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామంలో ప్రయాణికులకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే సంకల్పంతో గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ మరియు పాలకవర్గ సభ్యులు,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలోని బైపాస్ రోడ్డు, స్థానిక స్కూల్ ప్రహరీ గోడ ప్రక్కన, దాదాయిపల్లి రోడ్డు, చింతకుంట రూట్, రోడ్డుకు ఇరువైపుల గల ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలను తొలిగించి రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. అనంతరం బైపాస్ రోడ్ లో గుంతలో మట్టితో లెవెల్ చేశారు. గ్రామంలోని ప్రజలు గ్రామంలో కరెంటు సమస్య లేకుండా సర్పంచ్ తగిన చర్యలు తీసుకోవాలని కోరుకున్నారు.


# వరంగల్ భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ధ్వజ స్తంభ ప్రతిష్టాపన

**వరంగల్ సిటీ పెన్ సత్తా,జూన్ 13** దక్షిణ భారత దేశంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో స్వయంవ్యక్తమైన శ్రీ భద్రకాళీ దేవస్థానం దక్షిణాచార శాక్త్యాద్వైత సంప్రదాయ పద్ధతిలో వైదికాగమానికి అథారిటీగా చెప్పుకుంటారు. మనుష్య జన్మకు ప్రధానమైనది తాను తరిస్తూ పరులను తరింపజేయాలి, ఇందుకు దైవానుగ్రహం కావాలి. ఆత్మోద్ధరణకు అంటే తనను తాను ఉద్ధరించుకోవడానికి ఇంట్లో దేవతార్చన చేయాలి దానిని ఆత్మర్థపూజ అంటారు. ఆత్మార్థ స్థానం తన ఇల్లు. ఆ తరువాత తనతో పాటు ఈ లోకమంతా క్షేమంగా ఉండాలి అని భగవంతుడిని ప్రార్థించాలి. దానికి స్థానం దేవాలయం. ఆలయంలో చేసే పూజను పరార్థ పూజ అంటారు. మనిషికి రెండు ప్రధానమైనవే అవి ఒకటి ఆత్మార్థ పూజ, రెండవది పరార్థపూజ. ఈ పూజలు ఎలా చేయాలి అని చెప్పేవి ఆగమశాస్త్రాలు. ఈ ఆగమ శాస్త్రాలు జ్ఞానయోగక్రియాచర్య పాదాలు అని నాలుగు పాదాలుగా ఉంటాయి. పరార్థ పూజకు స్థానమైన ఈ ఆలయ నిర్మాణం ఎలా ఉండాలి అని చెప్పేది ఆగమ శిల్పశాస్త్రములు. ఈ ఆలయ నిర్మాణం అనేది మూడు దశలుగా ఉంటుంది. కర్షణాది ప్రతిష్టాంతం, ప్రతిష్ఠాది ఉత్సవాంతం, ఉత్సవాది ప్రాయశ్చిత్తాంతం. భూమిని త్రవ్వి ఆలయం నిర్మాణం పూర్తి చేసి మూర్తి ప్రతిష్ఠ చేయడం మొదటి దశ. కొన్ని స్వయం వ్యక్తమైన మూర్తులుంటాయి. వాటికి ఆగమ శిల్పశాస్త్రం ప్రకారం దేవాలయం కడతారు. వాటిని స్వయంభూ దేవాలయాలుగా పేర్కొంటారు. ప్రతిష్ఠ అయినది మొదలుకొని ఉత్సవాంతం రెండవ దశ. అంటే నిత్యాహ్నికం (నిత్య ధూప, దీప, నైవేద్యాలు) తో పాటు నిత్యోత్సవ పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాదులు జరుపడం ప్రతిష్ఠాది ఉత్సవాంతం అని అంటారు. ఇది రెండవ దశ. ఈ సందర్భంలో ఏడు రోజులకు పైబడి చేసే ఏ ఉత్సవానికైనా ముందుగా ధ్వజారోహణం జరుపాలి. ఈ ధ్వజారోహణం ధ్వజస్తంభం పైనే జరుపుతారు. ఏడు రోజుల కంటే తక్కువగా జరిపబడే ఉత్సవాలకు ధ్వజారోహణం అవసరం ఉండదు. కానీ ఆ ఉత్సవాలు జరుపబడాలన్నా శాశ్వత ధ్వజస్తంభం మాత్రం తప్పనిసరిగా ఉండాలి. ఈ ధ్వజస్తంభ దర్శనం కూడా భక్తులకు బహుముఖ ప్రయోజనాలు కల్పిస్తుంది. ఈ ధ్వజస్తంభంలో మూడు ప్రధానమైన భాగాలు ఉంటాయి. భూమిలో ఉండే భాగం చతురస్రంగా ఉంటుంది. దీన్ని బ్రహ్మభాగం అంటారు. పీఠంలో ఉండే భాగం ఎనిమిది భాగములుగా ఉంటుంది. ఇది విష్ణు భాగం. ఆ పైన ఉండే భాగం గుండ్రగా ఉంటుంది. అది రుద్రభాగంగా చెపుతారు. అంటే ఈ ధ్వజస్తంభం త్రిమూర్త్యాత్మమైనది. ఈ ధ్వజస్తంభాన్ని భూమిలో కూర్మశిలపై ఆధార పీఠాన్ని ఉంచి భూమిలో కూర్మశిల ప్రతిష్ఠ చేసి దానిపై గల ఆధార పీఠంలో నిలబెడతారు. ఈ కూర్మశిల భక్తులకు తెలిసీ తెలియక అశుచి కలిగివున్న భక్తులు ఆలయంలో ప్రవేశిస్తే అట్టి భక్తుల వల్ల ఆలయం అపవిత్రం కాకుండా పవిత్రంగా ఉంచేది ఈ కూర్మ శిల, తద్వారా ఆలయం ఎప్పుడు పవిత్రంగా ఉంటుంది. ధ్వజస్తంభానికి మేఖలాలు ఉంటాయి. ఆ మేఖలాలకు చిరుఘంటలు ఉంటాయి. ఆ ఘంటల సవ్వడికి అసురీ శక్తులు ఆ ప్రాంతాన్ని విడిచి దూరంగా వెళ్ళిపోతాయి. అంతేకాకుండా ఆ సవ్వడి భక్తులను పునీతులను చేస్తుంది. ఇత్యాది అనేకమైన ప్రయోజనాలను ఆలయ సందర్శన సందర్భంలో ధ్వజస్తంభం భక్తులకు అనేక విధములైన దైవికమైన ప్రయోజనాలను కలిగిస్తుంది. ఈ ధ్వజస్తంభం.
ప్రస్తుతమున్న ధ్వజస్తంభం శిథిలం కావడం వల్ల ఆ శిథిలమైన ధ్వజస్తంభాన్ని తొలగించి శాశ్వత ధ్వజస్తంభం ఆలయ ధర్మకర్తలు భద్రాచలం అడవుల నుండి నాణ్యమైన ధృడమైన స్తంభాన్ని ఖరీదు చేసి ఆలయానికి తీసుకువచ్చారు. సుమారు దాదాపు ఏడు లక్షల రూపాయల వరకు ఈ స్తంభం గుడికి రావడానికి వెచ్చించడం జరిగినది. ఈ ఖర్చంతా ఆలయ ధర్మకర్త శ్రీ జారతి వెంకటేశ్వర్లు వారి బంధువులు శ్రీ గోపాల నవీన్ రాజ్ సోదరులు భరించారు. ఈ ధ్వజస్తంభానికి ముందు భలిపీఠం దాని ముందు అమ్మవారి వాహనం ఉంటుంది. ఇదే వాహన చిహ్నం పంచలోహాలతో చేసినది ధ్వజస్తంభ శిఖరాగ్రంలో ఉంటుంది. లేదా దానికి ప్రత్యామ్నాయంగా ఒక కలశాన్ని ఉంచుతారు. ఈ ధ్వజస్తంభ ప్రతిష్ఠ 2026వ సంవత్సరం జూన్ 17వ తారీకు ఉదయం గం॥ 08-36ని॥లకు కర్కాటక లగ్నంలో శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధీశ్వరులు శ్రీ శ్రీ అభినవోదన్డ విద్యాశంకర భారతీ స్వామివారి కరకమలములచే జరుపబడుచున్నది. తెలంగాణా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు గౌ॥ శ్రీమతి కొండా సురేఖ , వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసనసభ్యులు లిగౌ॥ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి లి అనేక మంది ప్రముఖులు వేలాదిగా ఆలయానికి విచ్చేసే భక్తుల సమక్షమున ఈ క్రతువు నిర్వహింపబడుతోంది. ప్రతిష్టా సందర్భంలో ఈ ధ్వజస్తంభాన్ని లేపుతున్నపుడు దర్శించడం జీవుడు జన్మజన్మాంతర ప్రాప్తమైన పాపముల నుండి విముక్తుడై శాశ్వతమైన పుణ్యప్రాప్తిని పొందుతాడని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ సందర్భంగా పల్లెటూర్లలో, పట్టణాలలో మరియు మహానగరాలలో ఆలయాలలో జరుపబడే ధ్వజస్తంభ ప్రతిష్ఠ దర్శించడానికి దేశదేశాల నుండి ప్రజలు తమతమ గ్రామాలకు తిరిగి వస్తారు. అత్తవారింట్లో ఉన్న తమతమ ఆడపడచులను పిలిపించుకొని కొత్త భూషణాదులతో సత్కరిస్తారు. ఈ సందర్భంగా ముక్కోటి దేవతలు ఆ దేవాలయానికి చేరతారు. ఇట్లా అనేకమైన పుణ్యప్రాప్తి కలిగించేది ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ. ఈ కార్యక్రమాన్ని మూడు రోజులు జరుపుతారు. ఈ కార్యక్రమానికి రెండు రోజుల ముందుగా ప్రతిష్ఠాయాగాన్ని ఈ నెల 15 తేది సోమవారం రోజున ప్రారంభిస్తున్నారు. ఆనాడు జలాదివానం, ఆ మరునుటి రోజు ధాన్యాదివాసం, ఫలపుష్పపంచశయ్యాది వానములు జరుపుతారు. వేదఘోషలతో, నామసంకీర్తనములతో ఆగమోక్తక్రియాకలాపములతో జరుపబడే ఈ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మానవ జీవితంలో ఒక మరుపురాని పవిత్రమైన మహదానందాన్ని ప్రజలకు కలిగిస్తుంది.
కావున భక్తులు యావన్మంది ఈ కార్యక్రమంలో పాల్గొని యదోచితంగా పాల్గొని అణ్వయించ ప్రార్థన.

# దిగొస్తున్న బంగారం ధరలు

బంగారం ధరలు పతనమన్న వార్త మధ్యతరగతి ఇళ్లల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళల మొహాల్లో వెయ్యి వాట్ల బల్బు వెలిగినంత హ్యాపీనెస్ జిగేల్మంటోంది. మగవారికి జీతం పెరిగినప్పుడు వచ్చే సంతోషం ఒకెత్తయితే..మహిళలకు బంగారం ధర తగ్గినప్పుడు వచ్చే ఆనందం ఇంకో ఎత్తు. ఎందుకంటే, మధ్యతరగతి మహిళల దృష్టిలో బంగారం అనేది కేవలం ఒక నగ కాదు..అది వారి కష్టార్జితం, దాచుకున్న రహస్య పొదుపు, ఆపదలో ఆదుకునే ఒక నమ్మకం. నెలనెలా దాచుకున్న చిట్టీ డబ్బులు తీసి ఓ చిన్న ముక్కుపుడకో, ఉంగరమో కొనడం ఆడవాళ్లు ఆర్థికభద్రతగా భావిస్తారు. బంగారం ధర పది రోజుల్లో ఏకంగా 10 వేల 690 రూపాయలు తగ్గింది. గురువారం 24 క్యారెట్ల తులం బంగారం లక్షా 45 వేల 640కి దిగి వచ్చింది. ఒక్కరోజులోనే 2 వేలకు పైగా తగ్గింది. కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్రంగా ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. 2026 ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్లో రికార్డ్ స్థాయిలో ఒక ఔన్స్ బంగారం ధర దాదాపు 5,500 నుంచి 5,600 డాలర్ల దగ్గర ఆల్‌టైమ్ హైని తాకింది. కానీ, గడిచిన కొన్ని వారాల్లోనే అది ఏకంగా 4,200 డాలర్ల స్థాయికి పడిపోయింది. అంటే దాదాపు 15 నుంచి 20 శాతం వరకు క్షీణత. ఇరాన్ యుద్ధం మళ్లీ ఉద్రిక్తతలను పెంచుతోంది. ద్రవ్యోల్బణం భయపెడుతోంది.. అయినా సరే, సేఫ్ హెవెన్ గా భావించే బంగారం ధరలు ఎందుకు తగ్గుతున్నాయి.. దీని వెనుక గ్లోబల్ ఎకనామిక్ గేమ్ ఏంటన్న విశ్లేషణ సాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు 15శాతానికి పైగా తగ్గితే, ఇండియాలో కేవలం 4 నుంచి 5 శాతమే తగ్గాయి. దీనికి కారణం మన రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడటం. అలాగే 2026 మేలో భారత ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి 15శాతానికి పెంచడం. ఈ డ్యూటీ పెంపుతో మన దేశీయ మార్కెట్లో పూర్తి స్థాయిలో తగ్గుదల ప్రభావం కనిపించలేదు.ప్రపంచవ్యాప్తంగా బంగారం ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్లలోనే జరుగుతుంది. డాలర్‌కు, గోల్డ్‌కు ఎప్పుడూ వ్యతిరేక సంబంధమే. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే బలంగా ఉంది. డాలర్ బలంగా మారినప్పుడు, ఇతర కరెన్సీలు ఉపయోగించే దేశాలకు బంగారం కొనడం ఖరీదైన వ్యవహారం. దీనివల్ల అంతర్జాతీయంగా పుత్తడికి డిమాండ్ తగ్గి, ధరలు తగ్గుముఖం పడతాయి. 2026 ప్రారంభంలో, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందని అందరూ భావించారు. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ధరలు పెరుగుతాయి. కానీ సీన్ రివర్స్ అయింది. అమెరికాలో ఇటీవల విడుదలైన ఉద్యోగాల గణాంకాలు చాలా బలంగా వచ్చాయి. దీనికి తోడు పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు పైపైకి ఎగబాకాయి. చమురు పెరగడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందనే భయాలు మొదలయ్యాయి. ఫలితంగా, యూఎస్ ఫెడ్ తన వడ్డీ రేట్ల కోతను సెప్టెంబర్ 2026 లేదా ఆ తర్వాతకు వాయిదా వేసింది. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నంత కాలం, పెట్టుబడిదారులు బంగారాన్ని వదిలి బాండ్లపై దృష్టి పెడతారు. ఎందుకంటే బంగారం ఎలాంటి వడ్డీని ఇవ్వదు, కానీ యూఎస్ బాండ్లు ప్రస్తుతం దాదాపు 1.74శాతం రియల్ ఈల్డ్‌ను అందిస్తున్నాయి. దీంతో గోల్డ్ డిమాండ్ తగ్గి?రేట్లు డౌనయ్యాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ లేటెస్ట్ రిపోర్ట్ ప్రకారం, 2026 మొదటి క్వార్టర్‌లో సెంట్రల్ బ్యాంకుల కొనుగోళు దాదాపు 22శాతం తగ్గాయి. బంగారం ధరలు విపరీతమైన గరిష్ట స్థాయికి చేరడంతో, బ్యాంకులు కూడా కొత్త కొనుగోళ్లను కాస్త ఆపి, ప్రాఫిట్ బుకింగ్ వైపు మొగ్గు చూపాయి. అలాగే రష్యా సెంట్రల్ బ్యాంకు కూడా భారీగా భౌతిక బంగారం అమ్మేసుకుంటోంది. ఉక్రెయిన్ నాలుగేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా?వార్‌ను కంటిన్యూ చెయ్యడానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి గోల్డ్ వదిలించుకుంటోంది. ఈ నాలుగు నెలల్లో సుమారు 30 టన్నుల గోల్డ్‌ను సెల్ చేసింది.ఫిజికల్ గోల్డ్ కు డిమాండ్ తగ్గడం కూడా రేట్లు పడిపోవడానికి మరో కారణం. భారత్, చైనా వంటి దేశాల్లో ఆభరణాల డిమాండ్ గణనీయంగా పడిపోయింది. 2025, 2026 లలో ధరలు లక్షన్నర దాటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనడం తగ్గించేశారు. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ, లైట్ వెయిట్ జ్యువెలరీ లేదా పాత బంగారాన్ని మార్పిడి చేసుకోవడం పెరిగింది. మన దేశంలో బంగారం ధర పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్ మీద మాత్రమే ఆధారపడి ఉండదు. కొన్ని లోకల్ ఫ్యాక్టర్స్ పనిచేస్తాయి. డాలర్-రూపాయి మార్పిడి రేటు అందులో ఒకటి. డాలర్ ఇండెక్స్ పెరగడం వల్ల రూపాయి విలువ దాదాపు 95 రూపాయల మార్కును దాటి వెళుతోంది. రూపాయి బలహీనపడితే మనం దిగుమతి చేసుకునే బంగారం ఖరీదవుతుంది. దిగుమతులు కూడా తగ్గుతాయి. డిజిటల్ గోల్డ్, ఇటీల ట్రెండ్ బాగా పెరిగింది. భౌతిక బంగారం కంటే ఇప్పుడు యువత గోల్డ్ ఇటిఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ధరలు భారీగా పెరగడంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ ఈటిఎఫ్ ఇన్‌ఫ్లో కూడా తగ్గింది. డిమాండ్ సప్లై సూత్రం ప్రకారం?డిమాండ్ డౌనయ్యింది?రేటు దిగొచ్చింది. దేశంలో విదేశీ మారక నిల్వలను కాపాడటానికి ఒక్క ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనడం ఆపాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను కోరారు. పశ్చిమ ఆసియా యుద్ధంతో చమురు ధరలు పెరిగాయని?ఆయిల్ కొనడానికి డాలర్లు కావాలి కాబట్టి.. బంగారం దిగుమతులు తగ్గించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ ప్రకటన వచ్చిన మరుసటి రోజే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి ఏకంగా 15శాతానికి పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. సుంకం పెరగడం వల్ల విదేశాల నుంచి అధికారికంగా బంగారం దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇది దేశీయంగా బంగారం కొత్త కొనుగోళ్లను చాలా వరకు నియంత్రించింది. మోడీ పిలుపునిచ్చిన 10 రోజుల్లోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జ్యువెలరీ షాపుల్లో సేల్స్ 80శాతం పడిపోయాయి. కస్టమర్ల ఆలోచనాధోరణి కూడా కొంత మారిందని కొందరు బులియన్ మార్కెట్ నిపుణుల అభిప్రాయం. 10 మందిలో ఆరుగురు ఈ ఏడాది బంగారం కొనకూడదని ఫిక్స్ అయ్యారు.వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం.. భారతదేశంలో 2025లో డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు 69 శాతం పెరిగి 13.5 టన్నులకు చేరుకున్నాయి. ఇదే సమయంలో యూపీఐ ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్ల విలువ భారీగా పెరిగింది. 2025 జనవరిలో సుమారు ఎనిమిది వందల కోట్లుగా ఉన్న లావాదేవీలు? డిసెంబరు నాటికి 21 వందల కోట్లకుపైగా చేరినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే 2025 ఆగస్టు నాటికి డిజిటల్ గోల్డ్ లావాదేవీల సంఖ్య 377 శాతం పెరగడం? ఈ రంగం విస్తరిస్తున్న వేగాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు ఈ పెట్టుబడి విధానాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నట్లు చెబుతున్నారు మార్కెట్ నిపుణులు. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ మాదిరిగానే మొబైల్ ఫోన్‌లో కొన్ని క్లిక్‌లతో బంగారం కొనుగోలు చేయగలగడంతో? పెట్టుబడులు ఈజీ అవుతున్నాయి. చిన్న మొత్తాలతో పెట్టుబడి ప్రారంభించే అవకాశం కూడా యువతను డిజిటల్ గోల్డ్ వైపు ఆకర్షిస్తోంది. సాధారణంగా భౌతిక బంగారం కొనుగోలు చేయాలంటే వేల రూపాయలు అవసరమవుతాయి. డిజిటల్ గోల్డ్‌లో ఒకటి నుంచి వంద రూపాయల చిన్న మొత్తాల నుంచే పెట్టుబడి ప్రారంభించవచ్చు. దీంతో విద్యార్థులు, యువ ఉద్యోగులు, చిన్న పెట్టుబడిదారులు కూడా డిజిటల్ బంగారంలో పెట్టుబడి పెట్టగలుగుతున్నారు. అదనంగా? నెలవారీ ఆటోమేటిక్ సేవింగ్స్ విధానాల ద్వారా క్రమం తప్పకుండా బంగారం కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది. టన్నుల కొద్దీ బంగారం కొనే మన దేశంలో.. గ్రాములు కొనడానికి కూడా సామాన్యుడు వెనుకాడుతున్నాడు. షాపులు కస్టమర్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వ్యాపారులు డిస్కౌంట్లు ఇస్తామన్నా జనం అడుగు ముందుకు వేయడం లేదు. శతాబ్దాలుగా వస్తున్న గోల్డ్ సెంటిమెంట్‌ను దాటి ప్రజలు ఆలోచిస్తున్నారు. బంగారం ధరలు తగ్గినా?కొనుగోళ్లు పెరగడకపోవడం ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పునకు ఒక నిదర్శనం. గోల్డ్ కొనుగోళ్లు తగ్గడం అనేది కేవలం ఒక లోహం ముచ్చట కాదు. ఇది దేశంలోని మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోందనడానికి, వారి ఆర్థిక సందిగ్ధతకు ఒక ప్రత్యక్ష నిదర్శనం. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునకు జనం ఏస్థాయిలో జేజేలు కొడతారు అనడానికి?తగ్గిన గోల్డ్ డిమాండే ఉదాహరణ.

# ఆక్రమిత కశ్మీర్ కల్లోలం



ఎప్పుడూ జమ్మూ, కశ్మీర్ గురించి అంతర్జాతీయ వేదికలపై గంభీరోపన్యాసాలిస్తూ, మానవ హక్కుల చాంపియన్‌గా తనను తాను చిత్రించుకునే పాకిస్తాన్ గత కొన్ని రోజులుగా ఆక్రమిత కశ్మీర్‌లో నెత్తురుటేర్లు పారిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం సైన్యం కాల్పుల్లో 30 మంది మరణించారంటున్నా, వాస్తవ సంఖ్య అంతకుమించి ఉంటుందన్నది స్థానికులు చెప్పే మాట. మరో 200 మంది గాయపడ్డారు. వేలాదిమంది అరెస్టయ్యారు. ఈసారి సాగిన నిరసన ప్రదర్శన సాధారణమైంది కాదు. ముజఫరాబాద్ ప్రదర్శనలో అన్నివర్గాలకూ చెందిన లక్షన్నరమంది పాల్గొన్నారు. మతం పేరు చెప్పి, గతం పేరుచెప్పి ఎల్లకాలమూ జనాన్ని మభ్యపెట్టడం సాధ్యంకాదని పాక్ పాలకులకు ఈ నిరసనలు తెలియజెప్పాయి. తమ ప్రాంత నదుల్లో మంగళ డ్యామ్‌వంటి ప్రాజెక్టులు నిర్మించి,ఇక్కడ ఉత్పత్తయ్యే జలవిద్యుత్‌ను పంజాబ్ తదితర ప్రాంతాలకు తరలించుకుపోతూ, స్థానికులకు అరకొర సదుపాయాలు కల్పించటం విషయంలో రెండు దశాబ్దాల క్రితమే అసంతృప్తి పెల్లుబికింది. కానీ సంఘటితం కాకపోవటంవల్ల చల్లారిపోయాయి. 2023లో రావల్‌కోట్, ముజఫరాబాద్, మరికొన్ని ఇతర ప్రాంతాల్లో స్థానిక సమస్యలపై కమిటీలు ఏర్పడి ఉద్యమించాయి. ప్రజల మౌలికాహారమైన గోధుమ పిండి ధర పెంచడాన్నిప్రశ్నించాయి. వీటిని ప్రభుత్వం బేఖాతరు చేసిన ఫలితంగా ఆ కమిటీ లు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జాక్)గా ఒక్కటయ్యాయి. ఆనకట్టల కారణంగా పలువురు నిర్వాసితులవుతున్నా, వలసపోతున్నా పట్టించు కునేవారు లేరు. పోనీ అని స్థానిక ప్రజలకైనా ఒరిగేదేమీ ఉండదు. మిలిటెన్సీ ఉందన్న పేరిట భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరించటం ఒక్కటే వారికి కనబడేది. అందుకేశాంతియుత పద్ధతుల్లో పన్నుల నిరాకరణ ఉద్యమం నిర్వహించటం, విద్యుత్ బిల్లుల చెల్లింపు నిలిపివేయటం, సంపూర్ణ బంద్, లాంగ్‌మార్చ్ వంటివి ఈ మూడేళ్లలో ఎన్నో జరిగాయి. సైన్యం పడగనీడలో కాలక్షేపం చేసే ప్రభుత్వానికుండే అధికారాలు అంతంత మాత్రం. ఏ జవాబుదారీతనమూ లేని సైన్యానిదే పెత్తనం. అందుకే ఆక్రమిత కశ్మీర్‌కు ఎదుగూ బొదుగూ లేదు. ఆ ప్రాంత వనరుల్ని కొల్లగొట్టడానికి పాక్ పాలకులు ఒక సృజనాత్మక విధానం కనుక్కున్నారు. 53 మందితో దానికొక అసెంబ్లీ ఉంది. ఆక్రమిత కశ్మీర్‌కు ముఖ్యమంత్రి కాదు... ప్రధాని ఉంటాడు. కానీ అధికారాలన్నీ ఇస్లామాబాద్‌లో కొలువుదీరిన సైనికాధికారుల ఆధిపత్యంవుండే కశ్మీర్ కౌన్సిల్ చేతిలో ఉంటాయి. ఈసారి కేవలం ఆర్థిక సమస్యలపై మాత్రమే కాదు... అసెంబ్లీ అమరికపై కూడా డిమాండ్లు బయల్దేరాయి. మొత్తం 53 స్థానాలుండగా, 'శరణార్థుల'కు డజను కేటాయిస్తారు. మరో అయిదు మహిళలకూ... ఉలేమాలు, సాంకేతిక నిపుణులు, విదేశాల్లో స్థిరపడిన కశ్మీరీలకు ఒక్కొక్క స్థానం ఉంటాయి. ఈ ఖాతాలకింద పోయే 20 స్థానాలకూ ఎన్నికలు జరిగేదెక్కడో, నిర్వహించేదెవరో ఎవరికీ తెలియదు. వారు ఎన్నుకోవాల్సింది మాత్రం 33 మందిని. మళ్లీ ఇందులో అత్యధికులు పాక్ పాలకుల కనుసన్నల్లో నడిచేవారే ఉంటారు. చివరకు కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పడుతుంది. ఉద్యమకారులు అడిగేదల్లా 'శరణార్థుల' డజను స్థానాలూ రద్దు చేయాలన్నదే. కానీ అలా చేస్తే స్థానికుల పెత్తనం పెరుగుతుందని ప్రభుత్వం భయపడుతోంది. అందుకే జాక్ నాయకుల ఆచూకీ చెబితే 35,000 డాలర్లు బహుమతి ఇస్తామని ప్రకటించింది. వచ్చే నెల్లో ఆక్రమిత కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ ప్రాంత వనరుల దోపిడీ తప్ప, వారి ఆకాంక్షల్ని నెరవేర్చడం సాధ్యపడదని ఉద్యమాలను అణిచేయటం ద్వారా పాక్ చెబుతోంది. పాలకులు వలసవాద మనస్తత్వంతో ఆప్రాంతాన్ని చెరబట్టారు తప్ప, స్థానికుల డిమాండ్లపై ఖాతరు లేదు. ఉద్యమకారులు38 కోర్కెలు ప్రభుత్వం ముందుంచారు. డజను సీట్ల కోటా రద్దుతోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు, రాజకీయనాయకులకిస్తున్న ఖరీదైన కార్లు, ఉచిత విద్యుత్ తదితర రాయితీలు రద్దు చేసి, ఆ నిధులు జన సంక్షేమానికి వ్యయం చేయాలని కూడావారు కోరుతున్నారు. ఇలాగే మొండికేస్తూ పోతే ఆ ప్రాంత ప్రజల ఆగ్రహం మరింత పెరుగుతుందే తప్ప చల్లారదని పాకిస్తాన్ పాలకులు గ్రహించాలి.

# కాంగ్రెస్ దమనం కమలం మౌనం




జాతీయ స్థాయిలో పేరుకు అధికార, ప్రతిపక్షాలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ లో విలువలు వదిలేసి అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నా యి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు గడిచినా ఎన్నికల హామీలు అమలు చేయకుంటే, బీజేపీ మాట్లాడదు, పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తుంటే కనబడదు. రోజుకో భూదందా వెలుగు చూస్తుంటే పట్టించుకోదు. ఆఖరికి పేదల ఇండ్లు కూల్చుతుంటే గళమెత్తదు. మరి ఏం చేస్తుందంటే... అధికార పార్టీతో రాసుకుపూసుకొని తిరుగుతూ, కుదిరిన చోట దందాల్లో చేతులు కలుపుతూ 'నవ్విపోదురు గాక నాకేటి...' అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు ప్రజల్లో బలంగా వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే ప్రజల సమస్యల విషయంలో కాంగ్రెస్, బీజేపీ నిజంగానే వేర్వేరు పార్టీలేనా? లేక ప్రజల బాధల దగ్గరకు వచ్చేసరికి రెండూ ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయా? ఎందుకంటే గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో జరిగిన అనేక కీలక ఘటనలను ప్రజలు గమనిస్తే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేక చర్యల ఆరోపణలు వచ్చిన సందర్భాల్లో ప్రతిపక్షంగా ఉండాల్సిన బీజేపీ ఆశ్చర్యకరమైన మౌనం పాటించిందనే భావన బలపడుతున్నది. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేసినప్పుడు, తమ భూముల కోసం గిరిజనులు పోరాడినప్పుడు, ఎరువుల కోసం రైతులు లైన్లలో నిలబడినప్పుడు, హామీల అమలు కోరుతూ నిరుద్యోగ యువత ధర్నాలు చేసినప్పుడు, ఇండ్ల కూల్చివేతలు జరిగినప్పుడు పేదలు ఆర్తనాదాలు పెట్టినప్పుడు బీజేపీ ఎక్కడ ఉన్నదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజల గొంతుకగా నిలుస్తున్నది, సమస్యలపై నిరంతరం పోరాడుతున్నది, బీఆర్ఎస్ మాత్రమేననే అభిప్రాయం తెలంగాణలో రోజు రోజుకూ ప్రత్యక్ష సాక్ష్యాలతో నిరూపితమవుతున్నది. లగచర్ల ప్రాంతం లో గిరిజనుల భూములను ఫార్మా కంపెనీల పేరిట స్వాధీనం చేసుకునే ప్రయత్నాలపై పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. తరతరాలుగా జీవనాధారంగా ఉన్న భూమిని కోల్పోతామనే భయంతో గిరిజన కుటుంబాలు ఆందోళనకు దిగాయి. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న వారిపై దమనకాండ జరిగింది. కానీ బీజేపీ నాయకత్వం నుంచి స్పందన కనిపించలేదు. గిరిజన గ్రామాలకు వెళ్లి బాధితులను పరామర్శించలేదు. గిరిజనుల తరఫున బలంగా మాట్లాడింది, పోరాడింది బీఆర్ఎస్ నాయకత్వమే.తెలంగాణ ప్రభుత్వ అప్పులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాలను ప్రైవేటుకు కట్టబెట్టాలని పాలక పెద్దలు కుట్ర చేశారు. రాత్రికి రాత్రి 120 ఎకరాల అడవిని నరికివేశారు. ఈ భూములను విద్యాభివృద్ధికి, వర్సిటీ భవిష్యత్తు అవసరాల కోసం వినియోగించాలని విద్యార్థులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వం మాత్రం రియల్ ఎస్టేట్ కోణంలో ఆలోచించింది. ఈ అంశంలో కూడా కాంగ్రెస్, బీజేపీ ములాఖత్ స్పష్టంగా కనిపించింది. కేంద్ర విద్యాసంస్థల భూముల పరిరక్షణ గురించి బీజేపీ స్పష్టమైన వైఖరి తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. రైతులకు యూరియా అందకపోవడం వల్ల రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుభరోసా ఎగవేతలు పరిపాటిగా మారిపోయాయి. ప్రభుత్వం ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వకుండా పంటలు ఎండబెట్టింది. రైతులు ఎరువుల కోసం గంటల తరబడి లైన్లలో నిలబడాల్సిన దుస్థితి వచ్చింది. రైతులు పండించిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనకపోవడంతో కల్లాల్లో, మార్కెట్లలో ఎక్కడ చూసినా ధాన్యం పేరుకుపోయింది. పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇవ్వలేదు. ఇందులో ఏ అంశంపైనా బీజేపీ పట్టించుకున్న పాపానపోలేదు. రైతుకు అండగా నిలిచింది బీఆర్ఎస్. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదలకు చెందిన దాదాపు వెయ్యి ఇండ్లను ప్రభుత్వం కూల్చివేసింది. చిన్న పిల్లలు రోడ్డున పడటం, మహిళలు కన్నీళ్లు పెట్టుకోవడం, పేద కుటుంబాలు ఒక్కరాత్రిలోనే నిరాశ్రయులవడం యావత్తు రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. ఇంత పెద్ద మానవీయ విషాదం జరిగినప్పటికీ బీజేపీ నేతలు బాధితులను పరామర్శించలేదు. కేరళకు చెందిన అప్పటి సీఎం పినరయి విజయన్ కూడా ఈ విషయంపై స్పందించారు. కానీ గల్లీ నాయకత్వం నుంచి ఢిల్లీ నాయకత్వం వరకు కనీసం స్పందించలేదు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల నివాస ప్రాంతాలపై జరిగిన అరాచక చర్యలు కూడా ప్రజల్లో భయాందోళనలు సృష్టించాయి. ఈ అంశంలో బీజేపీ నాయకత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలబడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయకుండా, కుదిరితే సమర్థిస్తూ వచ్చింది. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ప్రభుత్వం పట్ల, ప్రభుత్వ పెద్దల పట్ల ఆగ్రహంతో ఉన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అంటూ ఎన్నికల ముందు కాంగ్రెస్ నమ్మబలికింది. కానీ ఆ హామీల అమలుకోసం యువత ధర్నాలు చేస్తే అరెస్టులతో వేధించింది. ఇంత జరుగుతున్నా బీజేపీ ఎందుకు స్పందించలేదు? ఈ సమయంలో నిరుద్యోగుల తరఫున నిరంతరం మాట్లాడింది బీఆర్ఎస్. నిరుద్యోగులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలుస్తూ గళమెత్తారు. కుమ్మర గ్రామంలో జరిగిన విషాద ఘటనలో రెండు నెలల చిన్నారి ప్రాణం కోల్పోవడం రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కదిలించింది. ఇలాంటి ఘటనల్లో రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు మానవత్వంతో స్పందించాల్సిన అవసరం ఉన్నది. బాధితులకు న్యాయం జరగాలని బీఆర్ఎస్ పోరాడింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో బీజేపీ నాయకత్వం విఫలమైంది. ఓ బీజేపీ నాయకుడి కుమారుడు, ఓ బాలికపై అఘాయిత్యం చేశాడని పోక్సో కేసు నమోదు కాగా, ఆ వ్యవహారంపై బీజేపీ మాట్లాడలేదు. విచిత్రంగా కాంగ్రెస్ నేతలు, మంత్రులు మౌనవ్రతం పాటించారు. అంటే దీన్ని బట్టి అర్థమయ్యేది ఏందంటే, ఆ రెండు పార్టీలకు స్వప్రయోజనాలు, రాజకీయలబ్ధి మాత్రమే కానీ, సమాజంలో వివిధ వర్గాల కష్టాలు పట్టవు. లేకపోతే బాలికకు అన్యాయం జరిగిన ఘటనలోనూ రాజకీయ లెక్కలు వేసుకోవడం ఏంది? ప్రజల సమస్యల దగ్గరకు వచ్చేసరికి కాంగ్రెస్ పాలకుల దమనకాండపై బీజేపీ మౌనం వహిస్తున్నది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాలని నిరంతరం మాట్లాడేది, ప్రజల సమస్యలను రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా ప్రజల కోణంలో చూసేది, ప్రజల తరఫున గళం వినిపించేది, ఉద్యమాలకు ముందుండేది బీఆర్ఎస్, గులాబీ దళం మాత్రమే. జై తెలంగాణ.

RNI:APTEL/2023/87729
ప్రశ్నించడం అందరి హక్కు..
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily



## హార్మూజ్ విషాదం!

హిందూ మహాసముద్రం నుంచి పర్షియన్ గల్ఫ్‌లోకి వెళ్లే ఇరుకైన సముద్ర మార్గం.. నేడు ప్రపంచ వాణిజ్యానికి మూసుకుపోయిన భయంకరమైన ద్వారంగా మారింది. ప్రపంచంలోని మొత్తం సముద్రమార్గ చమురు వ్యాపారంలో పాతికశాతం, ద్రవ సహజ వాయువు వ్యాపారంలో ఇరవై శాతం హార్మూజ్‌నుంచే సాగుతాయి. అలాంటి కీలకమైన మార్గం నేడు అమెరికా-ఇరాన్ యుద్ధ వికృత క్రీడలకు వేదికైంది. అమెరికా, ఇజ్రాయెల్.. ఇరాన్‌పై యుద్ధానికి తెరలేపిన నాటినుంచి హార్మూజ్ ప్రాంతంలో అదుపులేని విధ్వంసం కొనసాగుతోంది. ఇరాన్ జలసంధిని మూసివేసింది. అమెరికా ప్రతి దిగ్బంధనం విధించింది. రెండువైపులా పావులుగా మారిన వేలాది నిర్దోషి నావికులు ప్రాణభయంతో నౌకలపై నిలబడి ఉన్నారు. హార్మూజ్ జలసంధి మూసివేత కారణంగా దాదాపు 20వేలమంది నావికులు గల్ఫ్‌లో నిర్బంధావస్థలో చిక్కుకున్నారు. ఈ నావికుల్లో అత్యధిక సంఖ్య భారతీయులదే. ఇది ఈ యుద్ధంలో భారత్‌కు అత్యంత బాధాకరమైన వాస్తవం. అయినా మనదేశం నుంచి వినిపించేది దౌత్య నిరసన మాటలు మాత్రమే. ఇది మరింత భాధాకరం!

భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, హార్మూజ్ జలసంధిలో 13 భారతీయ జెండాలు కలిగిన నౌకలు నిలిచిపోయాయి. గల్ఫ్ ప్రాంతం మొత్తంలో 18వేలకు పైగా భారతీయ నావికులు పని చేస్తున్నారు. వారిలో 562మంది నేరుగా ప్రభావిత జలాల్లో ఉన్నారు. జూన్ 8న అమెరికా నౌకాదళం పలావు జెండా కింద నడిచే ఒక చమురు ట్యాంకర్‌ను దాడి చేసి నాశనం చేసింది. దానిపై 24మంది భారతీయ నావికులున్నారు. అదే రోజు అమెరికా మరో పలావు జెండా నౌకపై దాడి చేసి ముగ్గురు భారతీయ నావికులను హతమార్చింది. ఈ దాడుల తర్వాత భారత్ వాషింగ్టన్‌లోని అమెరికా రాయబారిని పిలిచి నిరసన తెలిపింది. కానీ ఆ నిరసన ఏ అలలూ సృష్టించలేదు. అమెరికా నౌకల్లో ఉన్న వ్యక్తుల జాతీయతలు తమకు తెలియవని చెప్పడం అసాధ్యమని ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి మనోజ్ యాదవ్ స్పష్టం చేశారు. నౌకలను నాశనం చేయడానికి బదులు నిర్బంధించే అవకాశం ఉండేదన్నారు. యుద్ధంతో తమకు సంబంధం లేకున్నా, ఇరవై దేశాల పౌరులు ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయారు. భారత్ అందులో అత్యంత నష్టపోతున్న తటస్థ దేశం. చైనా, రష్యా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో నావిగేషన్ స్వేచ్ఛ కోసం తీర్మానాన్ని వీటో చేశాయి. బ్రిటన్, జర్మనీ, జపాన్ సహా నాటో మిత్రదేశాలు నౌకా ఎస్కార్ట్ ఆపరేషన్‌లో పాల్గొనడానికి నిరాకరించాయి. ఒంటరిగా పోరాడలేని భారత్, నిరసన మాటలతో సరిపెట్టుకుంటోంది. ఇది జాతీయ నాయకత్వ సామర్థ్యంపై తీవ్రమైన ప్రశ్న రేకెత్తిస్తోంది.

హార్మూజ్ వివాదంలో ఇరాన్ పాత్ర కూడా తక్కువేం కాదు. నౌకలపై ఐఆర్‌జీసీ దాడులకు తెగబడింది. అండర్‌మైన్స్‌తో బెదిరిస్తోంది. దీంతో షిప్పింగ్ సంస్థలు ఆ మార్గాన్ని పూర్తిగా నిలిపివేశాయి. కువైత్, యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్ వంటి గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణి దాడులు జరిపింది. ఆ దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలున్నాయని మాత్రమే కారణం. ఆ దాడుల్లో అక్కడ నివసించే భారతీయులు కూడా బాధితులయ్యారు. ఇరాన్‌పై భారత్ తెలిపిన నిరసన కూడా అంతే నిర్లక్ష్యానికి గురైంది. ఏప్రిల్ 7న అమెరికా-ఇరాన్ మధ్య పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ప్రకటించినా, హార్మూజ్‌లో సముద్ర రవాణా పునరుద్ధరణ జరగలేదు. పరిస్థితి మరింత అస్థిరమైంది. ఇరాన్ ఓడరేవు సమీపంలో నిలిచిపోయిన భారతీయ నావికుడు అనిష్, యుద్ధం ప్రారంభమైన నాటినుంచి నౌకపైనే బందీగా ఉన్నారు. "మేం యుద్ధాన్ని, క్షిపణులన్నింటినీ ఇక్కడి నుంచే చూశాం" అని ఆయన చెప్పారు. కొందరు భారతీయ నావికులు ఇరాన్-అర్మేనియా సరిహద్దు మార్గంగా స్వదేశానికి చేరుకోగలిగారు. కానీ వేతనాలు రాలేదని అనేకులు నౌకపైనే ఉండిపోయారు. ఆర్థిక అనివార్యత వారిని ప్రమాదకర వాతావరణంలో ఉంచింది.

ఈ నేపథ్యంలో, యుద్ధం ముగింపువైపు ఆశావహ సంకేతాలు కనిపిస్తున్నాయి. ట్రంప్ రెండు రోజులపాటు చేపట్టిన ఇరాన్ లక్ష్యాలపై దాడులను అర్థంతరంగా నిలిపివేశారు. ఇరాన్ సుసంపన్నమైన యురేనియంను మూడో దేశానికి అప్పగించడానికి సిద్ధంగా ఉందని చర్చలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు పుంజుకున్నాయి. ముడి చమురు ధరలు తగ్గాయి. శాంతి అంచున ఉందన్న ఆశకు ఇవి నిదర్శనాలు. ప్రతిపాదిత శాంతి ఒప్పందంలోని ముఖ్యమైన అంశాల్లో హార్మూజ్ పునరుద్ఘాటన ఒకటిగా చర్చలో ఉంది. అయితే, ఈ శాంతి ప్రయత్నాలు ముందుకు సాగడానికి మరింత సమయం పట్టవచ్చు. ఆ సమయంలో కూడా నావికులు అదే ప్రమాదకర జలాల్లో నిలబడి ఉంటారు. 2026 హార్మూజ్ సంక్షోభం కారణంగా ఇప్పటివరకు 12మంది నావికులు మృతి చెందారు. 17 వ్యాపార నౌకలు దెబ్బతిన్నాయి. వాటిలో ఏడింటిని సిబ్బంది వదిలిపెట్టారు. ఈ గణాంకాల వెనుక ప్రతి సంఖ్యా ఒక మానవ విషాదం. హార్మూజ్‌ను ఎటువంటి షరతులు లేకుండా, సుంకాలు లేకుండా అన్ని దేశాల నౌకలకు అందుబాటులో ఉంచాలన్నది ప్రపంచ వాణిజ్య అవసరం మాత్రమే కాదు, అది నావికుల ప్రాథమిక హక్కు! ఈ యుద్ధం మొదలుపెట్టిన అమెరికా, ఇరాన్ రెండూ నిర్దోషులైన నావికుల ప్రాణాల విషయంలో విచారకరమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయి. ఇజ్రాయెల్ గాజాను ధ్వంసం చేసి, లెబనాన్‌లో యుద్ధం చేస్తూ, ఈ మొత్తం ప్రాంతాన్ని నరకంగా మార్చింది. ఆధునిక యుద్ధంలో గెలిచేవారెవరూ ఉండరు, ఓడిపోయేవారే ఉంటారన్న సత్యాన్ని గుర్తించడమే శాంతివైపు మొదటి అడుగు!

భారత్ ఈ సంక్షోభంలో కేవలం దౌత్య నిరసనలతో సరిపెట్టడం సరిపోదు. మరణించిన భారతీయ నావిక కుటుంబాలకు పరిహారం అందించే బాధ్యత భారత్‌దే.. గల్ఫ్ ప్రాంతంలో 18వేలమంది భారతీయ నావికులు పని చేస్తున్నారంటే, ఆ రక్షణ బాధ్యత నేరుగా ప్రభుత్వానిదే. జి-7 సదస్సులో మోదీ-ట్రంప్ సమావేశం జరగనున్న నేపథ్యంలో, హార్మూజ్‌లో మరణించిన, బందీగావున్న భారతీయ నావికుల అంశాన్ని అత్యంత పదునైన రీతిలో లేవనెత్తాలి. అది కేవలం మన నావికుల కోసమే కాదు, ప్రపంచ శాంతికి, స్వేచ్ఛా సముద్ర మార్గాల పరిరక్షణకు భారత్ నిజంగా కట్టుబడి ఉందని నిరూపించే సందర్భమది. మాటలు కాదు, ఇప్పుడు నావికుల కళ్లలోని ఆశకు సమాధానంగా చర్యలు కావాలి.

సంపాదకీయం



## కఠిన శ్రమతోనే కలల సాకారం!

"కలలు కంటే సరిపోదు. కఠిన శ్రమతోనే సాకారమవుతాయి" జెన్ జీ తరానికి -ప్రముఖ అమెరికన్ టెలివిజన్ రచయిత్రి, నిర్మాత షోండా రైమ్స్ ఓ ప్రసంగంలో చెప్పిన మాటలివి.

కేవలం ఊహల్లో బతికేస్తూ ఆచరణ శూన్యంగా మారే సోమరితనాన్ని ఆస్వాదించేవాళ్లు కలలు కనాల్సిన అవసరం లేదు -అంటూ ఆమె తీర్మానించేశారు. కావలసిన జీవితాన్ని ఊహించుకుంటూ కూర్చోవడం కాదు, అందుకోవడానికి పరిగెత్తాలన్నది ఆమె సూచన. ఈ మాటల వెనుక ఉన్న అసలు అంతరార్థం కలలు కనడం అనేది గమ్యాన్ని నిర్దేశిస్తుంది కానీ, శ్రమకు ప్రత్యామ్నాయం కాదని. ఒక వ్యక్తి రచయిత కావాలని కలగంటే సరిపోదు, నిరంతరం రాయడాన్ని అలవర్చుకోవాలంటారు ఆమె. ఉద్యోగంలో ఎదగాలన్నా, మంచి మార్కులు సాధించాలన్నా, వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాలన్నా -నిత్య శ్రమ ఒక్కటే మార్గం.

కలలు కనడం అనేది ఒక్కోసారి ఏమీ చేయకపోయినా ఏదో సాధిస్తున్నామనే భ్రమ, తాత్కాలిక మానసిక తృప్తినిస్తుంది. కఠిన శ్రమ ఒక్కటే.. ఆ భ్రమలను బద్దలు కొట్టి, కంటికి కనిపించే ప్రగతిని అందిస్తుంది. ఆశపడటం వేరు, దానికోసం క్షేత్రస్థాయిలో యుద్ధం చేయడం వేరన్నది షోండా రైమ్స్ గుర్తు చేస్తోన్న గొప్ప సూచన!

కలలకు క్రమశిక్షణ తోడవ్వాలి: క్రమశిక్షణ లేని కల కేవలం కోరికగానే మిగిలిపోతుంది. లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతర ప్రయత్నం, క్రమశిక్షణతో కూడిన దినచర్య అవసరం.

ఆలోచనలకంటే ఆచరణే ముఖ్యం: ఊహల్లో విహరించడం సులువే. కాని, ఫలితాలిచ్చేది ఆచరణ. మనం ఊహించుకునే విషయాల కంటే, ప్రతిరోజూ చేసే పనులే భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

శ్రమ మార్పును తెస్తుంది: కష్టపడటం వల్ల కేవలం విజయం మాత్రమే రాదు. అది ఒక వ్యక్తిలో, అతని ఆలోచనా విధానంలో అద్భుతమైన సానుకూల మార్పు తెస్తుంది.

స్ఫూర్తి వేరు.. ప్రగతి వేరు: ఏదైనా మోటివేషనల్ మాట విన్నప్పుడు కలిగే ఉత్సాహం వేరు. దానిని ప్రాక్టికల్‌గా అమలు చేయడం వేరు. లభించిన స్ఫూర్తిని అడుగుగా మార్చడమే విజయం.

స్పష్టత లేకున్నా ముందడుగు వేయాలి: భవిష్యత్తు గురించి పూర్తి స్పష్టత వచ్చేవరకు వేచి ఉండాల్సిన అవసరం లేదు. దొరికిన ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకుంటూ ముందుకు సాగడమే ముఖ్యమని షోండా బల్లగుద్ది మరీ చెప్తున్నారు.


నేటి తరానికి ఈ సందేశం ఎందుకు అవసరం?

ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియాలో మోటివేషనల్ కంటెంట్ విపరీతంగా పెరిగిపోయింది. చాలామంది స్ఫూర్తిదాయక కోట్లను సేవ్ చేసుకుంటారు, సక్సెస్ స్టోరీలు చూస్తారు, తమ ప్రణాళికల గురించి మాట్లాడుకుంటారు. కానీ అసలైన పని దగ్గరకు వచ్చేసరికి వెనకడుగు వేస్తారు. కలలు అందమైనవే, కానీ అవి మాత్రమే సరిపోవు. అద్భుతాలు దానంతట అవే జరగవు. ఎవరైతే మాయాజాలం కోసం ఎదురుచూడకుండా, క్రమశిక్షణ, ధైర్యంతో తమ చేతులతో భవిష్యత్తును నిర్మించుకుంటారో, వారికే నిజమైన విజయం దక్కుతుందని షోండా రైమ్స్ నిరూపించారు.

### ఎవరీ షోండా రైమ్స్?

అమెరికన్ టెలివిజన్ రంగంలో షోండా రైమ్స్ ఒక సంచలనం. ప్రముఖ రచయిత్రిగా, నిర్మాతగా, 'షోండాలాండ్' మీడియా సంస్థ వ్యవస్థాపకురాలిగా ఆమె ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందారు. అంతర్జాతీయంగా సూపర్ హిట్ అయిన 'గ్రేస్ అనాటమీ', 'స్కాండల్', 'ప్రైవేట్ ప్రాక్టీస్' వంటి టెలివిజన్ సిరీస్‌లను రూపొందించారు. ఆధునిక టెలివిజన్ ప్రపంచంలో బలమైన మహిళా పాత్రలను, వైవిధ్యమైన నటీనటులను ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చిన ఘనత ఆమెకే దక్కుతుంది. భయం, వ్యక్తిగత ఎదుగుదలపై ఆమె రాసిన 'ఇయర్ ఆఫ్ యెస్' అనే పుస్తకం కూడా పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంది.

# భవిష్యత్‌ను కూల్చేస్తున్నారు!



జెరూసలేం పురాతన గోడల నీడలో ఒక విషాదం మూగగా సాగిపోతోంది. అది -తూర్పు జెరూసలేంలోని సిల్వాన్ ప్రాంతంలో అల్-బుస్తాన్ సందుల్లో బుల్డోజర్ల మోత. ప్రపంచ దృష్టి గాజా యుద్ధంపైనుంచి ఇరాన్, లెబనాన్‌వైపు మళ్లిన సమయాన్ని అవకాశంగా వాడుకుంటూ, ఇజ్రాయెల్ పాలనాయంత్రాంగం తూర్పు జెరూసలేంలో పాలస్తీనియన్లను ఇళ్లనుంచి వెళ్లగొట్టే ప్రక్రియను వేగవంతం చేసింది. 2023 చివరి నుంచి ఇప్పటివరకు 59 ఆస్తులు నేలమట్టమయ్యాయి. కూల్చివేత ఆదేశాలు పొందిన వేలాది పాలస్తీనా కుటుంబాలు మున్సిపాలిటీ విధించే లక్షలాది డాలర్ల జరిమానాల భయంతో తమ ఇళ్లను తామే పెద్ద సుత్తులతో ధ్వంసం చేసుకుంటున్నారు. కష్టపడి కట్టుకున్న ఇళ్లను స్వయానా కూల్చుకుంటున్న వైనం.. ఆధునిక చరిత్రలో అత్యంత వేదనాభరితమైన దృశ్యాలలో ఒకటి కాకపోదు.

58 ఏళ్ల ఫాయెజ్ అవద్ శిథిలాలపై కూర్చుని మిగిలిన ఒక్క అంతస్తును దీనంగా చూస్తూ.. "ఈ ఇల్లు కట్టుకోవడానికి జీవితాలను ధారపోశాం. వాళ్లు నన్ను, నా పిల్లలను మళ్లీ రోడ్డుపైకి తెచ్చారు" అని నిట్టూర్చాడు. ఈ మాటల వెనుక ఒక తరం మొత్తం పోగొట్టుకున్న కలల చరిత్ర ఉంది. సిల్వాన్‌లో స్థానిక సామాజిక కార్యకర్త ఫఖ్రీ అబు దియాబ్ ఇల్లు చాలా కాలం కిందటే కూల్చేశారు. ఇప్పుడు శిథిలాల పక్కన ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నివాసం నుంచి కూడా ఆయనను, ఆయన భార్యను ఖాళీ చేయాలని అధికారులు బెదిరిస్తున్నారు. "ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులను వాడుకుని ఈ సమస్యకు ముగింపు పలకాలని ఇజ్రాయెల్ చూస్తోంది. అంతర్జాతీయ సమాజం మమ్మల్ని ఒంటరిగా వదిలేసింది. మునిసిపాలిటీ మాపై, మా ఉనికిపై బుల్డోజర్లతో యుద్ధం చేస్తోంది" అన్నారు అబు దియాబ్. ఇది కేవలం ఒక నగరంలో జరుగుతున్న ఆస్తుల తొలగింపు మాత్రమే కాదు. ఒక ప్రాంత ప్రజల అస్తిత్వాన్నే చెరిపివేసే రాజకీయ వ్యూహం!


జెరూసలేం యూదులు, క్రైస్తవులు, ముస్లింలకు సమానంగా పవిత్రమైన నగరం. 1967 మధ్యప్రాచ్య యుద్ధంలో జోర్డాన్ నుంచి తూర్పు జెరూసలేంను స్వాధీనం చేసుకున్న ఇజ్రాయెల్, తర్వాత దాన్ని తనలో విలీనం చేసుకుంది. కానీ ఈ విలీనాన్ని అంతర్జాతీయ సమాజంలో చాలా దేశాలు గుర్తించలేదు. అప్పటి నుంచి తూర్పు జెరూసలేం ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదానికి ప్రధాన కేంద్రంగా మారింది. మెజారిటీ ఇజ్రాయెలీలు జెరూసలేం మొత్తాన్ని తమ రాజధానిగా భావిస్తుంటే, పాలస్తీనియన్లు మాత్రం తాము కలలుగంటున్న భవిష్యత్తు స్వతంత్ర దేశానికి తూర్పు జెరూసలేం రాజధానిగా ఉండాలని కోరుకుంటున్నారు. అయితే, ప్రస్తుత ఇజ్రాయెల్ ప్రభుత్వం పాలస్తీనా దేశం అనే ఆలోచననే 'సమాధి' చేస్తామని ప్రతిజ్ఞ చేసింది. దానికి అనుగుణంగానే నేలమట్టమవుతున్న ఇళ్లు, నిర్వాసితమవుతున్న కుటుంబాలు సాక్ష్యమిస్తున్నాయి.

అల్-బుస్తాన్‌ను బైబిల్ నేపథ్యంతో కూడిన 'కింగ్స్ గార్డెన్'గా మార్చాలన్న జెరూసలేం మున్సిపాలిటీ ప్రణాళిక దాదాపు రెండు దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఈ ఉద్యానవనం నిర్వహణను ఒక యూదు సెటిలర్ సంస్థకు అప్పగించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. జనానికి ఖాళీ స్థలాలు లేని చోట పార్కు నిర్మించడమే తమ ఉద్దేశమని మున్సిపాలిటీ చెబుతున్నా, ఆ వాదన డొల్లగా ఉంది. ఇజ్రాయెల్ మానవ హక్కుల సంస్థ 'బిమ్కోమ' గణాంకాల ప్రకారం, 2025లో జెరూసలేంలో ఆమోదించిన కొత్త గృహ నిర్మాణ అనుమతుల్లో కేవలం ఏడుశాతమే పాలస్తీనియన్లకు మంజూరయ్యాయి. వీరు నగర జనాభాలో దాదాపు నలభై శాతం ఉన్నప్పటికీ. ఒకవైపు ఇళ్లు కట్టుకోనివ్వరు, మరోవైపు ఉన్న ఇళ్లను కూల్చేస్తారు. ప్రత్యామ్నాయ అభివృద్ధి ప్రతిపాదనలపై రాజీకి రావడానికి స్థానికులు చేసిన ప్రయత్నాలను అధికారులు తిరస్కరించారు. ఇది రాజ్య యంత్రాంగం చేతిలో సాగుతున్న నిరాయుధ యుద్ధమని అర్థం చేసుకోవచ్చు.

ఇజ్రాయెల్ చట్టాలు 1948కి ముందు యూదుల యాజమాన్యంలో ఉన్న ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి సెటిలర్లకు అనుమతిస్తున్నాయి. దీని ఫలితంగా సిల్వాన్‌లోని మరో ప్రాంతం 'బత్న్ అల్-హవా'లో దశాబ్దాలుగా నివసిస్తున్న పాలస్తీనా కుటుంబాలపై 'ఆక్రమణదారులు'గా ముద్ర వేస్తున్నారు. అదే సమయంలో, 1948లో జాఫావంటి ప్రాంతాల నుంచి పారిపోయి వచ్చిన పాలస్తీనా కుటుంబాలు తమ మూల స్థలాలను తిరిగి క్లెయిమ్ చేసుకోవడానికి ఆ చట్టాలు వీలు కల్పించవు. ఒకే న్యాయవ్యవస్థ నీడలో ఒకరికి అనుమతి, మరొకరికి నిరాకరణ. ఇది న్యాయమా అన్న ప్రశ్నకు సమాధానం ప్రపంచంపై ఉంది.

పురాతన జెరూసలేంలోని క్రైస్తవ, ముస్లిం ప్రాంతాలలో ఇప్పుడు యూదు సెటిలర్లు నివసిస్తున్న భవనాలపై ఇజ్రాయెల్ జెండాలు కనిపిస్తాయి. ఓల్డ్ సిటీలోని యెషీవా వివాదం ఈ సంక్లిష్టతను మరింత స్పష్టంగా చూపిస్తోంది. బ్రిటిష్ పాలన కాలంలో 1929లో జరిగిన మతపరమైన అల్లర్ల సమయంలో మూతపడిన ఆ యెషీవాను పాలస్తీనియన్ కాపలాదారు మహమ్మద్ బాషా అబ్దుల్‌ఘనీ దశాబ్దాలపాటు కాపాడారు. లోపలి వేలాది మతపరమైన గ్రంథాలను భద్రంగా ఉంచారు. 1967లో ఆ తాళాన్ని ఇజ్రాయెల్ అధికారులకు అప్పగించారు. ఆ నిస్వార్థ సేవకు బదులుగా ఇప్పుడు ఆయన కుటుంబంలోని పన్నెండు మంది సభ్యులు (అధిక శాతం వృద్ధులు) కోర్టు ఆదేశాల ద్వారా ఆ భవనాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితిలో ఉన్నారు. "మాకు వెళ్లడానికి వేరే చోటులేదు. నాకు తెలిసిన ఒకే ఒక్క ఇల్లు ఇదే" అని 76 ఏళ్ల ముఫిద్ బాషా అన్నారు. మతగ్రంథాలను కాపాడిన చేతులకు దక్కిన బహుమతి నిర్వాసనం. ఇంతకంటే దారుణమైన వైచిత్రి మరొకటి ఉంటుందా?

2018లో తూర్పు జెరూసలేంలో ప్రవేశపెట్టిన కొత్త భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా ప్రభుత్వం పాలస్తీనియన్లను ఖాళీ చేయించడానికి సాధనంగా వాడుకుంటోందని 'బిమ్కోమ' ఇటీవల విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. "ప్రస్తుతం జెరూసలేంలోని పాలస్తీనియన్లు తాము సురక్షితంగా లేమని భావిస్తున్నారు. చివరికి సొంత ఇంటిలో కూడా వారికి రక్షణ లేని పరిస్థితి ఏర్పడింది" అని ఇజ్రాయెల్ సెటిలర్ వ్యతిరేక సంస్థ 'ఇర్ అమీమ'కు చెందిన పరిశోధకుడు అవీవ్ టాటర్స్కీ అన్నారు. తూర్పు జెరూసలేంలో పరిస్థితి 'చాలా దారుణంగా' ఉందని యూరోపియన్ యూనియన్ ఇటీవల ఒక ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్ సెటిలర్ల విధానాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేసింది. అంతర్జాతీయ దౌత్యవేత్తలు అల్-బుస్తాన్ సందర్శించి పాలస్తీనియన్లతో మాట్లాడుతున్నారు. కానీ ప్రకటనలు వస్తున్నాయి, బుల్డోజర్లు ఆగడం లేదు. 1948లో జాఫానుంచి పారిపోయి, అప్పటి నుంచి మూడుసార్లు నివాసాలు మారిన 97 ఏళ్ల యుస్రా ఖైదర్ మంచానికే పరిమితమై, "వారు మమ్మల్ని ఇక్కడి నుంచి వెళ్లగొట్టాలని చూస్తున్నారు. నేను అనారోగ్యంతో ఉన్నాను, నడవలేను. మేం కేవలం దేవుడిపైనే భారం వేశాం" అంటున్నారు. ఆ మాటలు ఒక వ్యక్తి ఆర్తనాదం మాత్రమే కాదు, అంతర్జాతీయ న్యాయంపట్ల విశ్వాసాన్ని పోగొట్టుకున్న ఒక జాతి వేదన!! ■



జీవితంలో ఏదో మిస్సైన భావన కలుగుతోందా? అంటే -ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతున్నారన్న మాట. ఒక్కసారి వెనకొచ్చి చూడండి. అంటే -ఆన్‌లైన్ అందుబాటులో లేని కాలానికి. అప్పుడు చాలామంది ఏంచేసేవారు. పుస్తకం చదవడం, కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవడం, ఎక్కువ మందితో మాట్లాడడం, కొత్తప్రదేశాలను సందర్శించడం, వ్యాయామాలు చేయడం.. ఇలాంటి ఆఫ్‌లైన్ యాక్టివిటీస్‌కి టైం పెట్టేవారు. ఇప్పుడూ అదే పని చేయండి. రోజూ ఆన్‌లైన్‌లో వృథా చేస్తున్న సమయాన్ని వీటికి కేటాయించి చూడండి. మీ జీవితం కచ్చితంగా మెరుగుపడుతుంది. మీరు మిస్సైవుతున్నది అదే!

-మహాదేవ

వింతల్లో వింతలు

## వారెవా.. ఏమి ప్లాను బాసు!




షాపింగ్ అంటే మనసు పరవశించిపోతుంది. కానీ జేబు ఖాళీ అవుతుంది! దీనికి సరికొత్త పరిష్కారం కనుగొన్నారు దక్షిణ కొరియా యువతరం. "డోపమైన్ సైట్లు" అని పిలువబడే నకిలీ షాపింగ్ యాప్‌లలో అచ్చం అసలు మార్కెట్‌ప్లేస్‌లా ఉత్పత్తులు, రివ్యూలు, కార్ట్, చిరునామా నమోదు అన్నీ ఉంటాయి. ఆర్డర్ బటన్ నొక్కితే డెలివరీ బాయ్ మ్యాప్‌లో రియల్‌టైమ్‌లో కదులుతాడు. కానీ చివరికి ఏమీ రాదు, ఒక్క రూపాయి కూడా పోదు! అయినా మెదడుకు అదే సంతోషం, అదే డోపమైన్ రష్! అధిక జీవన వ్యయం నడుమ పొదుపు చేస్తూనే మానసిక తృప్తి పొందే ఈ విచిత్ర ట్రెండ్ నిజంగా వింతే!

# మెరిసిన గిల్, రాహుల్.. అఫ్గాన్‌పై భారత్ ఘన విజయం

ధర్మశాల: అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించిన టీమ్‌ఇండియా అదే జట్టుతో మూడు వన్డేల సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. ధర్మశాల వేదికగా జరిగిన తొలి వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా ఆటను 25 ఓవర్లకు కుదించగా.. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 22.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి పూర్తిచేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (84లి; 66 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఇషాన్ కిషన్ (34), కేఎల్ రాహుల్ (39లి; 19 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (16) పరుగులు చేశారు. రెండో వన్డే బుధవారం (జూన్ 17) లఖ్‌నవూలో జరగనుంది. జియావుర్ రెహ్మాన్ వేసిన 22 ఓవర్లో కేఎల్ రాహుల్ వరుసగా 6, 4, 4 బాదేశాడు. ఇదే ఓవర్లో చివరి బంతిని కూడా రాహుల్ స్టాండ్స్‌లోకి పంపాడు. 22 ఓవర్లకు స్కోరు 182/3. టీమ్‌ఇండియా విజయానికి 18 బంతుల్లో 13 పరుగులు అవసరం. జియావుర్ రెహ్మాన్ వేసిన 18 ఓవర్లో శ్రేయస్ అయ్యర్ (12) ఔటయ్యాడు. దీంతో భారత్ 142 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. టీమ్‌ఇండియా విజయానికి 45 బంతుల్లో 53 పరుగులు అవసరం. రషీద్ ఖాన్ వేసిన 13 ఓవర్లో ఇషాన్ కిషన్ (34) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 13 ఓవర్లకు టీమ్‌ఇండియా స్కోరు 117/2.

### గిల్‌ఏ3000

భారత కెప్టెన్ శుభ్‌మన్ నిలకడగా ఆడుతూ 37 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. మహ్మద్ నబీ వేసిన 12 ఓవర్‌లో గిల్ ఓ సిక్స్, రెండు ఫోర్లు బాది హాఫ్ సెంచరీ అందుకున్నాడు. ఈ క్రమంలో వన్డేల్లో వేగంగా (62 ఇన్నింగ్స్‌లు) 3 వేల పరుగులు పూర్తి చేసుకున్న భారత ఆటగాడిగా గిల్ రికార్డు సృష్టించాడు. 12 ఓవర్లకు భారత్ 109/1. టీమ్‌ఇండియా విజయానికి ఇంకా 78 బంతుల్లో 86 పరుగులు అవసరం. ఇషాన్ కిషన్ (32) పరుగులతో ఉన్నాడు. అఫ్గాన్ నిర్దేశించిన 195 పరుగుల లక్ష్యఛేదనలో భారత బ్యాటర్లు నిలకడగా ఆడుతున్నారు. ఇషాన్ కిషన్ (30), గిల్ (29) క్రమంగా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును ముందుకు కదిలిస్తున్నారు. 10 ఓవర్లకు స్కోరు 84/1.

### రోహిత్ రనౌట్

అఫ్గాన్‌తో జరుగుతున్న తొలి వన్డేలో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. రోహిత్ శర్మ (16; 16 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఔటయ్యాడు. ఘజన్‌ఫర్ వేసిన ఆరో ఓవర్‌లో బంతిని ఎదుర్కొన్న రోహిత్.. శుభ్‌మన్ గిల్‌తో సమన్వయలోపంతో రనౌటయ్యాడు. 6 ఓవర్లకు టీమ్‌ఇండియా స్కోరు 47/1. గిల్ (22), ఇషాన్ కిషన్ (1) క్రీజులో ఉన్నారు.



### ఓపెనర్‌గా 16 వేల పరుగులు

తొలి వన్డేలో భారత్‌కు అఫ్గాన్ 195 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టార్గెట్‌ను ఛేజ్ చేసేందుకు టీమ్‌ఇండియా బరిలోకి దిగింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (15), శుభ్‌మన్ గిల్ (6) నిలకడగా ఆడుతున్నారు. 3 ఓవర్లకు భారత్ స్కోరు 29/0. అజ్మతుల్లా బౌలింగ్‌లో రోహిత్ సిక్స్ కొట్టాడు. ఈ సిక్సర్‌తో హిట్‌మ్యాన్ వన్డేల్లో ఓపెనర్‌గా 16 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు.

### భారత్ టార్గెట్ 195

భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ బ్యాటింగ్ ముగిసింది. వర్షం కారణంగా ఆటను 25 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 26 రన్స్‌కే అఫ్గాన్ మూడు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ (102; 51 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లు) 'శత'క్కొట్టి జట్టును ఆదుకున్నాడు. ఒక దశలో 26 రన్స్‌కే అఫ్గాన్ మూడు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో ఓపెనర్ రహ్మనుల్లా జట్టును ఆదుకున్నాడు. హష్మతుల్లా (27)తో కలిసి నాలుగో వికెట్‌కు 66 బంతుల్లోనే 116 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. 15 ఓవర్లకు 140/3తో నిలిచి భారీ స్కోరు చేసేలా కనిపించిన అఫ్గాన్.. గుర్బాజ్ ఔటైన తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయింది. అరంగేట్ర బౌలర్లు గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబెలకు చెరో మూడు వికెట్లు దక్కాయి. అర్ష్‌దీప్ 2, నితీశ్ రెడ్డి రెండు వికెట్లు పడగొట్టారు.

### శుభ్‌మన్ గిల్ స్టన్నింగ్ క్యాచ్..

అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (26; 16 బంతుల్లో) పెవిలియన్ చేరాడు. హర్ష్ దూబె వేసిన 22 ఓవర్‌లో తొలి బంతికి భారీ సిక్స్ బాదిన ఒమర్‌జాయ్.. తర్వాత బంతికే స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన ఘజన్‌ఫర్ డకౌటయ్యాడు. హర్ష్ దూబె బౌలింగ్‌లోనే (21.4 ఓవర్) స్లిప్‌లో శుభ్‌మన్ గిల్ డైవ్ చేస్తూ ఒంటిచేత్తో కళ్లు చెదిరే క్యాచ్ అందుకోవడంతో ఘజన్‌ఫర్ ఔటయ్యాడు.

### సిక్స్.. వెంటనే ఔట్

భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గాన్ ఆరో వికెట్ కోల్పోయింది. మహ్మద్ నబీ (9) ఔటయ్యాడు. నితీశ్ రెడ్డి బౌలింగ్‌లో భారీ సిక్స్ కొట్టిన నబీ.. తర్వాత బంతికే అర్ష్‌దీప్ సింగ్‌కు చిక్కాడు. దీంతో అఫ్గాన్ 172 పరుగుల వద్ద ఆరో వికెట్ కోల్పోయింది. 21 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 176/6. అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (20), రషీద్ ఖాన్ (4) క్రీజులో ఉన్నారు.

### హర్ష్ దూబెకు తొలి వికెట్

అఫ్గానిస్థాన్ ఐదో వికెట్ కోల్పోయింది. అరంగేట్ర బౌలర్ హర్ష్ దూబె వేసిన 16.3 ఓవర్‌కు హష్మతుల్లా షాహిదీ (27).. రాహుల్‌కు క్యాచ్ ఇచ్చాడు. హర్ష్ దూబెకు వన్డేల్లో ఇది తొలి వికెట్. 17 ఓవర్లకు అఫ్గానిస్థాన్ స్కోరు 144/5. మహ్మద్ నబీ (0), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (2) క్రీజులో ఉన్నారు.

### గుర్బాజ్ సెంచరీ

భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ (101; 51 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీ బాదాడు. 26 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన అఫ్గాన్‌ను గుర్బాజ్ అదిరే బ్యాటింగ్ చేసి ఆదుకున్నాడు. 25 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న గుర్బాజ్ తర్వాత మరింత దూకుడు పెంచాడు. చివరకు నితీశ్ రెడ్డి వేసిన 16 ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 16 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 143/4. హష్మతుల్లా షాహిదీ (27), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (1) క్రీజులో ఉన్నారు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించిన సంగతి తెలిసిందే.

### దూకుడు పెంచిన గుర్బాజ్

అఫ్గాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ హాఫ్ సెంచరీ తర్వాత మరింత దూకుడు పెంచాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన 11 ఓవర్లో 4, 6 బాదిన అతను.. తర్వాత వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు, ఓ ఫోర్ రాబట్టాడు. 12 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 110/3. రహ్మనుల్లా (86) సెంచరీ దిశగా సాగుతున్నాడు. హష్మతుల్లా షాహిదీ (17) పరుగులతో ఉన్నాడు. భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ దూకుడుగా ఆడుతున్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన ఏడో ఓవర్లో రెండు ఫోర్లు, హర్ష్ దూబె బౌలింగ్‌లో ఫోర్, సిక్స్ బాదాడు. మళ్లీ ప్రసిద్ధ్ బౌలింగ్‌లో గుర్బాజ్ వరుసగా రెండు ఫోర్లు రాబట్టాడు. హర్ష్ దూబె వేసిన తర్వాతి ఓవర్లో సిక్స్ కొట్టి 25 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. 10 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 79/3. రహ్మనుల్లా (57), హష్మతుల్లా షాహిదీ (16) క్రీజులో ఉన్నారు.

## స్పోర్ట్స్

# ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో ఓడిన పీవీ సింధు




సిడ్నీ: ఆస్ట్రేలియన్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీలో హైదరాబాదీ ప్లేయర్ పీవీ సింధు ఇవాళ సెమీఫైనల్లో ఓటమి చవి చూసింది. జపాన్‌కు చెందిన మేటి ప్లేయర్ అకేన్ యమగుచి చేతిలో ఆమె వరుస గేమ్స్‌లో పరాజయాన్ని ఎదుర్కొన్నది. 20-22, 12-21 స్కోరుతో యమగుచి విజయం సాధించింది. మూడో నెంబర్ ర్యాంక్‌తో జపనీస్ ప్లేయర్ ఈ టోర్నీలో ఆడారు. కేవలం 43 నిమిషాల్లోనే ఈ మ్యాచ్ ముగిసిపోయింది. సింధు ఓటమితో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారతీయ క్రీడాకారుల ప్రాతినిధ్యం ముగిసింది. ఫస్ట్ గేమ్‌లో జపాన్ ప్లేయర్‌కు ధీటుగా సింధు ఆడింది. షాట్‌కు షాట్ కొట్టింది. ఇద్దరు ఆటగాళ్లు ఓ దశలో ఆరు వరుస పాయింట్లను సాధించుకున్నారు. కానీ గేమ్ పాయింట్ వద్ద సింధు తడబడింది. ఓపెనింగ్ గేమ్‌ను యమగుచి చేజిక్కించుకున్నది. ఇక సెకండ్ గేమ్‌లో సింధు ఆటతీరు పూర్తిగా మారిపోయింది. యమగుచి చాలా ఈజీగా దూసుకెళ్లింది. ఓ దశలో 13-6 పాయింట్లు సాధించింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండానే యమగుచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నది. ఇక సింగిల్స్ ఫైనల్లో థాయ్‌ల్యాండ్ క్రీడాకారిణి పోర్న్‌పావీ చోచువాంగ్‌తో యమగుచి తలపడనున్నది. ఇటీవల కాలం యమగుచి చేతిలో సింధు వరుసగా ఓటమి ఎదుర్కొన్నది. ఆరు మ్యాచుల్లో అయిదు సార్లు ఓడంది. కానీ ఓవరాల్‌గా 15-13 తేడాతో సింధు లీడింగ్‌లో ఉంది.

# సెల్ఫీ కల్చర్‌పై మహేష్ బాబు రియాక్షన్.. వైరల్ అవుతున్న కామెంట్స్

సూపర్ స్టార్ మహేష్ బాబు సాధారణంగా వివాదాలకు, సంచలన వ్యాఖ్యలకు దూరంగా ఉండే వ్యక్తి. తెరపై ఎనర్జీతో మెప్పించే ఆయన, వ్యక్తిగత జీవితంలో మాత్రం చాలా రిజర్వ్‌గా ఉంటారనే విషయం అభిమానులకు తెలిసిందే. సినిమా షూటింగ్స్, ప్రమోషన్లు తప్పితే మిగతా సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపడానికి ఇష్టపడే మహేష్, సోషల్ గ్యాదరింగ్స్ లేదా పార్టీ కల్చర్‌కు కూడా ఎక్కువగా దూరంగానే ఉంటారు. అయితే తాజాగా సెల్ఫీ కల్చర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుత కాలంలో సెలబ్రిటీలకు ఎదురవుతున్న ప్రైవసీ సమస్యల గురించి మహేష్ బాబు తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. అప్పట్లో ఫోన్లలో కెమెరాలు ఉండేవి కాదు. చాలా ప్రశాంతంగా ఉండేది. ఇప్పుడు ఎయిర్‌పోర్ట్‌లో దిగితే ఒక్కొక్కరు సెల్ఫీలు అడుగుతుంటారు. అది తప్పు అని నేను చెప్పడం లేదు. అభిమానుల ప్రేమ, ఉత్సాహం అలాంటిదే. కానీ ఒక స్థాయి దాటితే అది వ్యక్తిగత గోప్యతలోకి వస్తుంది. ప్రతిరోజూ అదే పరిస్థితి ఎదురైతే కొంచెం ఇబ్బందిగా అనిపిస్తుందంటూ ఆయన చెప్పిన మాటలు వైరల్ అవుతున్నాయి. అభిమానుల పట్ల తనకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేస్తూనే, సెలబ్రిటీల పర్సనల్ లైఫ్ ను గౌరవించాల్సిన అవసరం ఉందనే సందేశాన్ని మహేష్ సున్నితంగా తెలియజేసినట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి. సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ల విస్తరణతో సెలబ్రిటీ- ఫ్యాన్ సంబంధాలు గతంతో పోలిస్తే పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు స్టార్ హీరోలను ప్రత్యక్షంగా చూడటమే అభిమానులకు గొప్ప అనుభూతి అయితే, ఇప్పుడు సెల్ఫీ లేదా వీడియో లేకపోతే ఆ క్షణం అసంపూర్ణంగా భావించే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఎయిర్‌పోర్టులు, రెస్టారెంట్లు, హాలిడే స్పాట్లు వంటి ప్రైవేట్ సందర్భాల్లో కూడా సెలబ్రిటీలు కెమెరాల మధ్యనే ఉండాల్సి వస్తోంది. మహేష్ బాబు చేసిన వ్యాఖ్యలు ఈ మారుతున్న కల్చర్‌పై మరోసారి చర్చకు తెరలేపాయి. అభిమానుల ప్రేమ ఎంత ముఖ్యమో, అదే సమయంలో వ్యక్తిగత స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యమనే అభిప్రాయానికి ఆయన మాటలు బలం చేకూర్చాయి. ఇక సినిమాల విషయానికి వస్తే, మహేష్ బాబు ప్రస్తుతం దర్శక ధీరుడు ఎా. ఎా. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ సినిమా కోసం ఆయన ప్రత్యేకమైన మేకోవర్‌తో సిద్ధమయ్యారు. అడ్వెంచర్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాను 2027 ఏప్రిల్ 7న రిలీజ్ చేయాలనే టార్గెట్ తో మేకర్స్ ముందుకు సాగుతున్నట్లు సమాచారం. ఒకవైపు కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన సినిమాలో నటిస్తూనే, మరోవైపు సెలబ్రిటీ జీవితంలో ఉండే సవాళ్ల గురించి మహేష్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానుల మధ్య హాట్ టాపిక్‌గా మారాయి. అభిమానుల ప్రేమను గౌరవిస్తూ, తన వ్యక్తిగత ప్రైవసీపై కూడా స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేసిన మహేష్ బాబు మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చించబడుతున్నాయి.



డిజిటల్ మరియు సినీ ప్రపంచాలను జయిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి, అందాల తార ప్రకృతి పావని



తెరపై తనదైన ముద్ర వేస్తున్న మోడల్, నటి మరియు ఫిట్‌నెస్ ఐకాన్ సాక్షి మాలిక్‌ను కలవండి

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com